
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 25 ఫిబ్రవరి 2025

4.86 లక్షల టన్నుల ధాన్యం

ప్రశ్నార్థకం!

జిల్లాలో నిలిచిపోయిన కొనుగోళ్లు

కుప్పల్లో 2.38 లక్షల టన్నులు.. రైతుల వద్ద మరో 2.48 లక్షల టన్నుల నిల్వలు

- ఇప్పటివరకు ప్రభుత్వం కొన్న ధాన్యం 5.80 లక్షల టన్నులు
- మిగిలిన ధాన్యం కూడా కొనాలని రైతుల వేడుకోలు
- పట్టించుకోని పౌరసరఫరాలశాఖ అధికారులు
- ఇదే అదనుగా తక్కువ ధరకు అడుగుతున్న మిల్లర్లు, ప్రైవేటు వ్యక్తులు

పౌరసరఫరాలశాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణి రైతుల సహనానికి పరీక్ష పెడుతోంది. పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పాలకులు చెబుతున్నా అధికారులు నసేమీర అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రైతుల వద్ద 4.86 లక్షల టన్నుల ధాన్యం ప్రశ్నార్థకంగా మారింది. ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సేవా కేంద్రాలకు, మిల్లర్ల వద్దకు వెళితే అనుమతులు రాలేదని తిప్పి పంపేస్తున్నారు. ఇదే అదనుగా మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు ధర తగ్గించి అడుగుతున్నారు. నగదు చెల్లింపుల్లో ఆసల్యం జరుగుతుందని షరతులు పెడుతున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు.

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లాలో 302 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సంక్రాంతి పండుగ ముందువరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. ఆ తర్వాత మిల్లు యజమానులు చెల్లించిన బ్యాంకు గ్యారంటీ అయిపోయిందని, మిల్లులకు ఇచ్చిన ధాన్యం టార్గెట్‌లు పూర్తయ్యాయని ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. ప్రస్తుతం మినుమ తీత పనులు జరుగుతున్నాయి. దీంతో పాటే రైతులు కుప్పనూర్పిడి చేస్తున్నారు. ధాన్యం శాంపిళ్లను రైతు సేవా కేంద్రాలకు రైతులు తీసుకువెళితే ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోయిందని, ప్రభుత్వంతో సంబంధం లేకుండా రైస్ మిల్లులకు ధాన్యం విక్రయించుకోవాలని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం కుప్పల్లో ధాన్యం 2.38 లక్షల టన్నుల ధాన్యం ఉందని, కుప్పలు నూర్పిడి చేసి విక్రయించడానికి రైతుల వద్ద మరో 2.48 లక్షల టన్నులు ఉందని పౌరసరఫరాలశాఖ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను పంపారు. ఈ ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులకు జాయింట్ కలెక్టర్ లేఖ రాశారు. అయినా ధాన్యం కొనుగోలుకు అనుమతులు రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75కిలోల ధాన్యం బస్తా రూ.1,725 కొనుగోలు చేయాలి. రైతులు మిల్లు యజమానుల వద్దకు ధాన్యం శాంపిళ్లను తీసుకువెళితే రూ.1,520లకు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ప్రైవేటుగా కొనుగోలు చేసిన ధాన్యం మరపట్టి బియ్యంగా మార్చి కాకినాడ పోర్టుకు తరలించాలని, దీంతో అన్ని ఖర్చులు కలుపుకుని అంతకుమించి ధరను ఇవ్వలేమని మిల్లర్లు తెగేసి చెబుతున్నారు. ఈ ధరకైనా ఇప్పటికిప్పుడు ధాన్యం కొనుగోలు చేయలేమని, ధాన్యం బిల్లులు ఆలస్యమవుతాయని చెప్పడం గమనార్హం. ఎకరానికి 30 బస్తాల ధాన్యం దిగుబడి వస్తే ఈ ధరకు రైతులు ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర బస్తాకు రూ.225లను నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మచిలీపట్నం మండలంలో ధాన్యం నిల్వలు



కొనుగోలు చేసిన ధాన్యం 5.80 లక్షల టన్నులే..

జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో 1.67 లక్షల హెక్టార్లలో వరిసాగు జరిగింది. 9.79 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. వారం రోజుల కిందటి వరకు 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. ఇటీవల మరో 30వేల టన్నుల ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాలశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ 30వేల టన్నుల ధాన్యానికి సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను గంట వ్యవధిలోనే పూర్తి చేశారు. గతేడాది నవంబరు 13 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. గత నాలుగు నెలల వ్యవధిలో 5.80 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 4.86 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. మార్చి నెలాఖరు నాటికి ధాన్యం కొనుగోలుకు సంబంధించి సర్వర్‌ను నిలిపివేస్తారు. ఈ నెల రోజుల వ్యవధిలో 4.86 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇంత మేర కొనుగోలు చేసేందుకు ఎప్పటికి అనుమతులు ఇస్తారు, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. పౌరసరఫరాలశాఖ అధికారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలుకు అనుమతులను త్వరితగతిన ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రొయ్యూరు మద్యం షాపు వద్ద నిర్మించిన సిటింగ్ అరుగులపై కూర్చుని మద్యం తాగుతున్న మందుబాబులు



ఓపెన్ బార్లు!

మద్యం షాపుల్లో యథేచ్ఛగా లూజు సేల్స్

- డిస్పోజ్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు విక్రయం
- మందు బాబుల కోసం బల్లలు, రేకుల షెడ్ల నిర్మాణం
- బార్లను తలపిస్తున్న గ్రామాల్లోని మద్యం షాపులు
- ఊరికి ఐదారు బెల్టుషాపులు.. బహిరంగంగానే నిర్వహణ
- మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారులు

మద్యం లూజు సేల్స్‌తో గ్రామాల్లోని షాపులు బార్లను తలపిస్తున్నాయి. డిస్పోజ్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు కూడా విక్రయించడంతో మందు బాబులు అక్కడే సిట్టింగ్ పెడుతున్నారు. వ్యాపారాన్ని పెంచుకునేందుకు సిమెంట్ బల్లలతో రేకులు షెడ్లు నిర్మించడంతో ఉదయం, సాయంత్రం వేళ ఆ ప్రాంతాలు జాతరను తలపిస్తున్నాయి. రూ.40 వేలు కడితే నేరుగా షాపుల నుంచి మద్యం వస్తుండటంతో ఊరికి ఐదారు బెల్టుషాపులు వెలుస్తున్నాయి. బహిరంగంగానే విక్రయాలు సాగుతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో మద్యం షాపులు బార్లను తలపిస్తున్నాయి. మూడు మద్యం షాపులు, వంద బెల్టుషాపులు అన్న రీతిన విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. తోట్లవల్లూరు, రొయ్యూరు, యాకమూరు గ్రామాల్లో అధికారికంగా మూడు మద్యం దుకాణాలున్నాయి. నిబంధనల ప్రకారం మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా మద్యం తాగడానికి అనుమతి లేదు. ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తేనే పర్మిట్ రూమ్‌కి అనుమతి ఇస్తారు. కాని పర్మిట్ రూమ్‌లకు అనుమతి లేకుండానే ఆయా షాపుల వద్ద బహిరంగంగా మద్యం తాగడానికి వ్యాపారస్తులు ఏర్పాట్లు చేయటం గమనార్హం. రొయ్యూరు షాపు ముందు భాగంలోనే రేకులషెడ్డు నిర్మించి సిమెంటు అరుగులు, బల్లలను ఏర్పాటు చేయటంతో అక్కడే మద్యం తాగుతున్నారు. దీన్ని ఓపెన్ బార్‌లాగా తయారు చేశారు. తోట్లవల్లూరు షాపు వద్ద రౌండ్ టేబుళ్లు నిర్మించారు. ఈ రెండు షాపుల వద్ద ఉదయం, సాయంత్రం మందుబాబుల సందడి కనిపిస్తోంది. విపరీతంగా మద్యం తాగి కంట్రోల్ లేని విధంగా బైక్‌లను మిగతా 6లో..



శంభో శంకర

- రేపటి మహాశివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు
- ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో విస్తృతంగా ఏర్పాట్లు 8లో
- శివనామస్మరణతో మారుమోగనున్న శివాలయాలు

ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి క్రతువులు ప్రారంభం

6లో

మద్యం విక్రయాలు 48 గంటలపాటు బంద్

- కలెక్టర్ బాలాజీ

8లో

హైవే దొంగలు దొరికారు

- రూ. 6.50 లక్షల విలువైన బైకులు స్వాధీనం

6లో

గ్యాస్ సిలిండర్‌లకు నగదు వసూలు చేస్తే చర్యలు

8లో

- డీఎస్‌వో పార్వతి
- తూనికలు కొలతలు, పౌరసరఫరాలశాఖ అధికారులు, గ్యాస్ డీలర్లతో సమీక్ష

రోజురోజుకు పెరిగిపోతున్న అంతర్గత ట్రాఫిక్ సమస్యలతో నగర వాసులు నానా అవస్థలు పడుతున్నారు. తూర్పు బైపాస్‌పైనే ఇన్నాళ్లూ ఆశలు పెట్టుకున్నారు. అది లేదన్న సంకేతాలు రావడంతో ఇన్నర్ రింగ్ రోడ్డే ప్రత్యామ్నాయంగా మారింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని 24 గ్రామాల మీదుగా, ఎన్‌హెచ్- 16, 65, 30, 163జీలకు అనుసంధానంగా నిలవనుంది. ట్రాఫిక్ డైవర్షన్‌కు అనువైన ఇన్నర్ రింగ్ రోడ్డుపై ప్రభుత్వం సత్వర కీలక నిర్ణయం తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

ఇన్నర్‌తోనే ఇక్కట్లకు చెక్!

తూర్పు బైపాస్‌పై ఇన్నాళ్లూ ప్రజల ఆశలు

బైపాస్‌కు ప్రత్యామ్నాయం ఇన్నర్ రింగ్ రోడ్డు

నగరంలో పెరుగుతున్న అంతర్గత ట్రాఫిక్ సమస్యలు



ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో 24 గ్రామాల మీదుగా వెళ్తున్న ఐఆర్ఆర్

- ఎన్‌హెచ్- 16, 65, 30, 163జీలకు అనుసంధానం

ట్రాఫిక్ డైవర్షన్‌కు అనువైన మార్గం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు అడుగులు పడుతున్న తరుణంలో ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) విషయంలో కూడా సత్వర కీలక నిర్ణయం తీసుకోవాలని ప్రజల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. ఐదు జిల్లాల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమరావతి రాజధానికి అనుసంధానంగా తీర్చిదిద్దుతున్న ప్రాజెక్టు అవుటర్ రింగ్ రోడ్డు. విజయవాడ నగరంలో నెలకొన్న అంతర్గత ట్రాఫిక్ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలంటే విజయవాడ వెస్ట్ బైపాస్‌కు సమాంతరంగా విజయవాడ తూర్పు బైపాస్‌ను కూడా చేపట్టాల్సిన అవసరం ఉంది. విజయవాడ తూర్పు బైపాస్ అవసరం లేదని కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్తు) అలైన్‌మెంట్ కమిటీ నిర్దేశించటంతో దాదాపుగా ఇది లేనట్టేనని తెలుస్తోంది. విజయవాడ నగరంలో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలకు పూర్తి పరిష్కారం చూపాలంటే తక్షణం ఐఆర్ఆర్ పనులు కూడా ఆరంభించాల్సిందేనన్నది ప్రజల అభిప్రాయం. విజయవాడ అంతర్గత ట్రాఫిక్‌ను గణనీయంగా తగ్గించటానికి ప్రత్యామ్నాయ రోడ్డుగా సీఆర్‌డీఏ అధికారులు ఐఆర్ఆర్ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూర్తి స్థాయిలో కాకపోయినా కనీసం ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలను మిగతా 6లో..

ఐఆర్ఆర్‌తో తక్షణ పరిష్కారం

అవుటర్ రింగ్ రోడ్డు అమరావతికి బాహ్యంగా వెళ్లే రహదారి. 190 కిలోమీటర్ల నిడివిన టన్నెల్స్‌తో కూడుకున్న నిర్మాణం పూర్తి కావటానికే గరిష్ఠంగా ఐదేళ్లకు పైగా పదేళ్ల వరకు కూడా సమయం పట్టడానికి అవకాశం ఉంది. ఇన్నర్ రింగ్ రోడ్డు అనేది రాజధాని అంతర్భాగంగా ఉంటుంది. విజయవాడ నగర సరిహద్దు వెంబడి అంతర్లీనంగా సాగుతుంది. విజయవాడలో నెలకొన్న తీవ్ర ట్రాఫిక్ సమస్యలకు ఇన్నర్ రింగ్ రోడ్డు తక్షణ పరిష్కార మార్గం.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఇలా..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మొత్తం 24 గ్రామాల మీదుగా సాగుతుంది. చోడవరం, దాములూరు, దోనె ఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, కొండపల్లి, కొత్తూరు, కొటికలపూడి, నవీ పోతవరం, నిడమానూరు, నున్న, పాతపాడు, పెనమలూరు, పోరంకి, రామచంద్రాపురం, సావారిగూడెం, తాడేపల్లి, త్రిలోచనాపురం, వెదురుపావులూరు, వెలగలేరు, జమీమాచవరం, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాలు ఉన్నాయి.

కేసుల చిక్కులు

మాజీ ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుయాయుల అరాచకాలపై సమగ్ర విచారణ

- మైనింగ్ అక్రమాలు, టీడీపీ ఆఫీస్‌పై దాడి, సత్యవర్ధన్ కిడ్నాప్..
- భూ కబ్జాలు, రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, నకిలీ ఇళ్ల పట్టాలపై ఆరా
- రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు శాఖలపైనా దర్యాప్తు
- అప్పట్లో వంశీ అనుచరుల అరాచకాల్లో వివిధశాఖల అధికారులకు వాటాలు
- అన్నింటిపై సమగ్ర విచారణ జరపనున్న సిట్

గన్నవరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన అనుయాయులు సాగించిన అరాచకాలకు లెక్కే లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ మైనింగ్, భూ కబ్జాలు, రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, నకిలీ ఇళ్ల పట్టాలు, టీడీపీ కార్యాలయంపై దాడి వంటి ఘటనలతో రెచ్చిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారు. ఈ కేసులపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను వేయటంతో వంశీ గ్యాంగ్ కేసుల చిక్కుల్లో పడనుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, ఆయన అనుయాయులు గన్నవరం నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా సాగించిన అక్రమాల ఫలితంగా ఇప్పుడు చిక్కుల్లో పడనున్నారు. అక్రమ మైనింగ్, భూ కబ్జాలు, బెదిరింపులు, మోసాలు, చివరాఖరికి కిడ్నాప్‌లకు పాల్పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని చేసిన ఈ అక్రమాలపై ఇప్పటికే వివిధ శాఖల అధికారులు అంతర్గత విచారణ చేస్తున్నారు. ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా విచారణకు ఆదేశించినప్పటికీ అక్రమ క్వారీయింగ్‌కు సంబంధించిన అంశాలపై ఇప్పటికే విచారణ జరిపి రూ.195 కోట్ల మేర అక్రమాలు జరిగినట్టుగా ప్రాథమికంగా నివేదించటం



జరిగింది. గన్నవరం నియోజకవర్గంలో జరిగిన అక్రమాలకు సంబంధించి రెవెన్యూ, పంచాయితీరాజ్, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు తదితర శాఖలతో ముడిపడిన ఉన్న అంశాలు అనేకం ఉన్నాయి. విజిలెన్స్ ఒక్కటే పూర్తి స్థాయిలో అక్రమాలను ప్రాథమికంగా గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అన్ని శాఖలలో జరిగిన అక్రమాలపై దృష్టి సారిస్తేనే చైన్ లింక్‌గా జరిగిన అరాచకాలు, మోసాలు, కబ్జాలు వెలుగులోకి రానున్నాయి. దీనిని దృష్టిలో మిగతా 6లో..

ఐదు ప్రధాన కేసులపై దృష్టి

సిట్ ఏర్పాటుతో ప్రధానంగా గన్నవరంలో వంశీ ఆయన అనుయాయులు సాగించిన ప్రధానమైన ఐదు కేసులను విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకటి టీడీపీ కార్యాలయంపై వంశీ పథక రచనలో భాగంగా దాడి జరగడం, రెండు టీడీపీ ఆఫీసుపై దాడి ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షిగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ కిడ్నాప్ వ్యవహారం, మూడు అక్రమ మైనింగ్, భూ కబ్జాలు, నాలుగు రెవెన్యూ రికార్డుల ట్యాపరింగ్, ఐదు నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై సిట్ సమగ్ర విచారణ జరిపే అవకాశం ఉంది.



గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న ఆలయ డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు అర్చకస్వాములు


మహా శివరాత్రి క్రతువులు ప్రారంభం



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తొలిరోజైన సోమవారం పాంచాహ్నిక దీక్షాపూర్వక క్రతువులు దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి శ్రీగంగా, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామివార్ల ఉత్సవమూర్తులకు మంగళ స్నానాలు జరిపించి ఆలయ అర్చకులు వధూవరులుగా అలంకరించారు. ఈ సందర్భంగా దేవదేవేరీలకు దేవస్థానం తరపున అధికారులు పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం 4 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, మండపారాధన, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, మూల మంత్ర హవనములు, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగంతో తొలిరోజు పూజా క్రతువులు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు వి.శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు వై.మల్లేశ్వర శాస్త్రి, డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, సహాయ కార్య నిర్వహణాధికారి ఎం.దుర్గారావు, వైదిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26న ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి ప్రత్యేక అభిషేకాలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లేశ్వర స్వామివారికి త్రికాల అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మూడు దఫాలుగా అభిషేకాలను నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు మహాన్యాసం అనంతరం లింగోద్భవ కాల అభిషేకాలు, మహానివేదన, హారతి, మంత్ర పుష్పం తదితరాలను నిర్వహిస్తారు. అనంతరం గంగా పార్వతి, మల్లేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను వేదిక మీద ప్రతిష్ఠించి దివ్యలీలా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవం ఆర్జిత సేవా టిక్కెట్లు దేవస్థానం వెబ్‌సైట్, దేవస్థానం కౌంటర్లలో లభిస్తాయని ఆయన ప్రకటనలో తెలిపారు.



తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితా

తప్పుల తడకగా ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా

కూచిపూడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా మొవ్వ మండలంలో తప్పుల తడకగా ఉంది. బూత్ నెంబర్ 167లో ఒకే వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండగా, అదే బూత్‌లో మరోవ్యక్తి మూడు ఓట్లు కలిగి ఉన్నాడు. కూచిపూడికి చెందిన బోరుకాటి సతీష్ కుమార్‌కు రెండు ఓట్లు ఉన్నట్టు ఓటర్ల జాబితాలో ఉండగా, ఈడే సాంబశివరావు మూడు ఓట్లు కలిగి ఉన్నట్టు జాబితాలో ఉంది. ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

చట్టసభలను జగన్ కించపరిచారు : రవీంద్ర



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్ష హోదా అడిగేందుకు మాత్రమే జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రావడం చట్టసభలను కించపరచడమేనని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్‌రెడ్డి అవినీతి, అరాచకపాలనపై విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించారన్నారు. టీడీపీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తామని జగన్‌రెడ్డి విర్రవీగిన మాటలు మరచిపోయారన్నారు. వైసీపీ ఐదేళ్లపాటు ఎన్ని అరాచకాలకు పాల్పడినా, జైళ్లకు పంపినా టీడీపీ నాయకులు అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది అధికార పక్షంలో ఉన్న నాయకులు కాదని, ప్రజలే అన్నారు. ఎమ్మెల్యేగా అవకాశం కల్పించినప్పటికీ ప్రజాస్వామ్యంపై గౌరవం లేక జగన్‌రెడ్డి అసెంబ్లీకి ఇప్పటివరకు రాలేదన్నారు. ప్రజాతీర్పును గౌరవించని పక్షంలో అసెంబ్లీ పదవికి జగన్‌రెడ్డి రాజీనామా చేయడమే మంచిదన్నారు.

వైసీపీ నేత శ్రీధర్‌రెడ్డి అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియా విభాగం నేత ఎ.శ్రీధర్‌రెడ్డిని సూర్యారావుపేట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఎం చంద్రబాబుపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన పోలీసులు శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. గుంటూరుకు చెందిన శ్రీధర్‌రెడ్డిపై లోగడ అక్కడి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇంతకుముందు హైకోర్టు న్యాయమూర్తులపై చాలా అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టాడు. ఈ కేసులో గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. మూడు నెలలపాటు కారాగార జీవితం గడిపిన శ్రీధర్‌రెడ్డి కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో వికృత పోస్టింగ్‌లు చేస్తున్నాడు. అతడికి సూర్యారావుపేట పోలీసులు సంకెళ్లు వేశారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలపై హర్షం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. సోమవారం కొనకళ్లను మచిలీపట్నంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, కార్మికులు తన కళ్లు అని, వారి కుటుంబసభ్యులకు ఏ విధమైన ఇబ్బందులు జరగకుండా చూస్తామన్నారు.

జనసేన సమన్వయకర్తల నియామకం

విజయవాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లాలో నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు సంబంధించి జిల్లాలోని పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను పార్టీ నియమించింది. విజయవాడ లోక్‌సభ స్థానానికి సామినేని ఉదయభాను, మచిలీపట్నం స్థానానికి బండి రామకృష్ణకు సమన్వయకర్తల బాధ్యతలను అప్పగించింది. మార్చి 14వ తేదీన ఈ వేడుకలు పిఠాపురంలో నిర్వహించబోతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- రూపాయి అదనంగా వసూలు చేసినా సహించేది లేదు
- ఫిర్యాదులు రుజువైతే ఏజెన్సీ లైసెన్సుల రద్దుకూ వెనుకాడం
- దీపం-2 అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పాల్గొన్న అధికారులు, గ్యాస్ డీలర్ల ప్రతినిధులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దీపం-2 పథకం ద్వారా అందించే ఉచిత గ్యాస్ సిలిండర్లకు లబ్ధిదారుల నుంచి అదనంగా ఒక్క రూపాయి వసూలు చేసినా సహించేదిలేదని, ఫిర్యాదులు రుజువైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులు రద్దు చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. జిల్లాలో దీపం-2 పథకం అమలు, ఐవీఆర్ఎస్ సర్వే నివేదికలు, ఫిర్యాదులపై చర్యలు తదితరాలపై చర్చించేందుకు కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో పాటు వివిధ ఎల్‌పీజీ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దీపం-2 పథకాన్ని అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేసే విషయంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని, పథకం అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయని, దీపం పథకం కింద ఉచితంగా పొందుతున్న సిలిండెర్లకు లబ్ధిదారులు చెల్లించిన నగదు 48 గంటల్లో వారి ఖాతాల్లో జమవుతోందన్నారు. ఇప్పటివరకు పథకం ద్వారా 4,05,611మంది ఖాతాల్లో దాదాపు రూ.32.19కోట్లు జమయిందన్నారు. అయితే ఉచిత గ్యాస్ పథకం కింద ముందు చెల్లించే అసలు బిల్లుకు అదనంగా డెలివరీ బాయ్స్ కొంత మొత్తాన్ని వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయని, ఇలాంటి ఫిర్యాదులకు సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డీలర్లు బాధ్యత వహించాల్సి వుంటుందని స్పష్టం చేశారు. ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా మొదటి విడతలో తొమ్మిదిమంది ఎల్‌పీజీ డీలర్లకు, రెండో విడతలో ఐదు మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. జిల్లాలో వున్న 52 ఏజెన్సీలు నిబద్ధతతో సేవలందించాలని, ఏవైనా అవకతవకలకు పాల్పడితే ఏపీ పెట్రోలియం ప్రొడక్ట్స్ యాక్ట్, ఎమ్మార్పీ యాక్ట్ తదితరాల ద్వారా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ వినియోగదారులు రశీదులో ముద్రించి వున్న ధరకంటే అదనంగా ఒక్కరూపాయి కూడా చెల్లించనవసరం లేదని అదేవిధంగా వినియోగదారుడు గ్యాస్ సిలిండర్ తీసుకొనే సమయంలో తూకంలో తేడా ఉన్నట్టు అనుమానం వుంటే సదరు డెలివరీ బాయ్స్ ద్వారా తూకాన్ని సరిచూసుకోవచ్చన్నారు. పౌరసంబంధాలు, తూనికలు-కొలతల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో డీఎస్వో ఎ.పాపారావు, జిల్లా లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ కృష్ణచైతన్యతో పాటు ఎల్‌పీజీ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు

హైవే దొంగలు దొరికారు

- రూ. 6.50 లక్షల విలువైన బైకులు స్వాధీనం

కంకిపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : హైవేపై వాహనదారులను బెదిరించి దొంగతనాలకు పాల్పడుతున్న పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ నెల 18న తెల్లవారుజామున కంకిపాడు నుంచి ప్రొద్దుటూరు వెళ్తున్నాడు. అదే సమయంలో ఐదుగురు వ్యక్తులు రెండు బైకులపై వచ్చి సదరు వ్యక్తిని బెదిరించి అతని వద్ద ఉన్న రూ. 10 వేలు బలవంతంగా లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ గంగాధర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన కంకిపాడు సీఐ మురళీకృష్ణ ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టారు. ఈనెల 24న ఈడుపుగల్లు సెంటర్ వద్ద రెండు బైకులపై అనుమానాస్పదంగా తిరుగుతున్న యర్రంశెట్టి విజ్ఞేశ్వర, బనవల పణీంద్ర కుమార్, గోట్లు సిద్దూ, నీలపు మోహన్, మరో మైనర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారు అపహరించిన రూ.10 వేలు నగదు, రూ. 6.50 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్టు డిఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈనెల 27న కృష్ణా-గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ సోమవారం నగరంలోని పటమట బాలుర ఉన్నత పాఠశాల, లయోలా కళాశాలలోని వివిధ పోలింగ్ స్టేషన్లను తనిఖీచేశారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాల కల్పన విషయంలో ఎలాంటి లోటుపాట్లు వుండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రలోభాలకు తావులేని, స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరుగుతోందని, దీనిలో భాగంగా పోలింగ్ స్టేషన్‌లను సందర్శించి, చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్నట్టు వెల్లడించారు. భద్రతా చర్యలు, వెబ్‌క్యాస్టింగ్ తదితరాలపైనా మార్గనిర్దేశనం చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో మొత్తం 112 పోలింగ్ స్టేషన్లు వున్నాయని, ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒకరు చొప్పున మొత్తం 112 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించి శిక్షణ కూడా ఇచ్చినట్టు తెలిపారు. తనిఖీల్లో కలెక్టర్ వెంట విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దుర్గగుడిలో హ్యాకింగ్‌పై ఐటీ నిపుణులతో పరిశీలన

- దేవదాయ కమిషనర్, ఈవో రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సిస్టమ్ నెట్‌వర్క్ హ్యాకింగ్‌పై ఐటీ నిపుణులతో విచారణ చేపడుతున్నామని ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం సిస్టమ్ నెట్‌వర్క్ హ్యాకింగ్‌కు గురికాలేదని, ఆన్‌లైన్ వ్యవస్థ, ఈ ఆఫీసు విధానాలు పటిష్టంగా పూర్తి భద్రతలో ఉన్నాయన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'హ్యాకింగ్ కింగ్' కథనానికి ఆయన స్పందించారు. దేవస్థానంలో సెక్యూరిటీ ఆడిట్ జరిగిందని, ఆన్‌లైన్, ఈ ఆఫీసు భద్రతా చర్యలు పటిష్టంగా ఉన్నాయని చెప్పారు. ఏదేమైనా ఈ అంశంలో దేవదాయ శాఖ ఐటీ నిపుణుల ద్వారా పూర్తి పరిశీలన చేయిస్తామని చెప్పారు. మరోవైపు విరాళాల సేకరణ, దాతలతో సంభాషణ, సంబంధం లేని వ్యక్తుల ప్రమేయం లేకుండా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దుర్గగుడిలో ఒక ఉద్యోగి ఈ ఆఫీసు నోటిఫికేషన్‌ను తన సొంత సిస్టమ్‌కు బదలాయించినట్టు, దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్టు వచ్చిన కథనానికి వివరణ ఇస్తూ.. దేవస్థానం సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఇంతకు ముందు పనిచేసిన కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు ఒక సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహించారన్నారు. ఆన్‌లైన్ టెండర్ వ్యవహారాలు, ఎఫ్ఎంఎస్‌కు సంబంధించిన ఐడీ పాస్‌వర్డ్‌లు వంటి కీలకమైనవి ఈవో వద్దనే ఉండాల్సి ఉండగా, సీనియర్ అసిస్టెంట్‌కు అప్పగించి పనులు జరిపించినట్టు తెలుస్తున్నదన్నారు. ఈవో బాధ్యతలు చేపట్టినప్పటికీ ముఖ్యమైన కీలక ఫైళ్లను ఆ సీనియర్ అసిస్టెంట్ అప్పగించకుండా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించినట్టు చెప్పారు. దేవస్థానం గోప్యత, భద్రత ఉల్లంఘనల అభియోగాల పై సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని సస్పెండ్ చేశామన్నారు. అతడిపై వచ్చిన ఆరోపణల విచారణకు డిప్యూటీ కమిషనర్, దేవస్థాన ఉప కార్యనిర్వహణాధికారిని నియమించినట్టు తెలిపారు. విచారణ సమయంలో తగు సాంకేతిక సహకారం అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. విచారణ ఇంకా పూర్తి కాలేదని, సస్పెండ్ అయిన సీనియర్ అసిస్టెంట్‌ను విధుల్లోకి తీసుకోలేదని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

కేసుల చిక్కులు!

(5వ పేజీ తరువాయి)

పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను వేయటంతో ఈ కేసులపై సంపూర్ణ విచారణకు అడుగు ముందుకు పడింది.

కనీవినీ ఎరుగని మైనింగ్ దోపిడీ

గన్నవరం నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని విధంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జరిగాయి. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో చెరపట్టని కొండలు లేవు. కొండలను బోడిగుండ్లగా మార్చివేసి కోట్లాది రూపాయలను ఆర్జించారు. గ్రావెల్ తరలింపులో ఎన్నడూ లేని విధంగా రెవెన్యూ, పంచాయితీరాజ్, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అప్పటి అవినీతి అధికారులను కూడా భాగస్వామ్యం చేసి వారికి వాటాలు ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు ఎప్పుడూ పట్టించుకోలేదు. భారీ సంఖ్యలో చెరువులను ఆక్రమించారు. అక్రమంగా తవ్వకాలు సాగించారు. పేదల నుంచి భూములను బలవంతంగా లాక్కుని భారీ ఎత్తున మట్టి తవ్వకాలు చేశారు. పోలవరం కాలువను కూడా వదలకుండా మట్టి తవ్వుకుపోయారు. ప్రజలను బెదిరించి వారి భూములను వంశీ అనుయాయులు లాక్కున్నారు. భూ రికార్డుల ట్యాంపరింగ్‌కు సైతం పాల్పడ్డారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సొంతగా పేదలకు ఇళ్ల పట్టాలను ఇచ్చారు. పట్టాలపై తహసీల్దార్ సంతకం చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. పట్టాలు ఇచ్చిన వారెవరికి ఆ పట్టాల్లో నిర్దేశించిన భూములు ఎక్కడ ఉన్నాయో తెలియదు. ఇవన్నీ ప్రాథమికంగా గుర్తించినప్పటికీ.. వీటిపై చర్యలు తీసుకోవటానికి సమగ్రమైన విచారణ అవసరం.

ఓపెన్ బార్లు!

(5వ పేజీ తరువాయి)

నడుపుకుంటు అనేకమంది ప్రమాదాల బారిన పడుతుండగా, కొందరు అక్కడే మత్తులో డొల్లాడుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న యాకమూరు షాపు వద్ద కూడా బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. ఇక్కడ ప్రయాణికులు, కాలేజీలకు వెళ్లే విద్యార్థినులు మందుబాబుల అల్లరి చేష్టలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం షాపు నుంచి మద్యం కొనుగోలు చేసి వెళ్లిపోవాలి. అక్కడ తాగటానికి వీల్లేదని అధికారులు మాటలు చెబుతున్నా చేతల్లో అమలు చేయటం లేదు. అలాగే మద్యం షాపుల్లో లూజ్‌సేల్స్ చేయకూడదు. అందుకు విరుద్ధంగా లూజ్ సేల్స్ చేస్తూ, డిస్పోజ్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను కూడా షాపుల్లోనే విక్రయిస్తున్నారు.

రూ.40 వేలు కడితే బెల్టుషాపు

మండలంలోని ప్రతి గ్రామంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. బెల్టుషాపు నిర్వహిస్తే సహించేదిలేదని సీఎం చంద్రబాబు అనేక సార్లు హెచ్చరించినా ఫలితం లేకుండా ఉంది. ఇక్కడ ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారులతో కలిసి అక్రమాలకు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గ్రామంలో బెల్టుషాపు నిర్వహించేందుకు రూ.40 వేలు కట్టించుకున్నట్టు సమాచారం. ఇలా రూ.40 వేలు కట్టిన వారి బెల్టుషాపునకు నేరుగా షాపు నుంచి మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. కొందరు బెల్టుషాపు నిర్వాహకులు పెద్ద సంచులను తెచ్చి మద్యం సీసాలను బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై మద్యం కేసులను తరలిస్తున్నారు. తోట్లవల్లూరులో జడ్పీ హైస్కూల్ పక్కన, మధురాపురంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ప్రత్యేక బెల్ట్‌షాపులను నిర్మించటం గమనార్హం. భద్రిరాజుపాలెంలో కరకట్ట పక్కన రెస్టారెంట్‌లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు, మద్యసేవనం సాగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవటం లేదని విమర్శలున్నాయి. గ్రామాల్లో ఇళ్ల మధ్యే బెల్టుషాపులున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి బహిరంగంగా మద్యం తాగడాన్ని అరికట్టాల్సిన అవసరం ఉంది.

కంట్రోల్ చేస్తాం: ఎక్సైజ్ సీఐ

బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, నెలకు 10 నుంచి 15 బెల్టుషాపులపై దాడి చేసి అరికడుతున్నామని ఎక్సైజ్ సీఐ శేషగిరిరావు తెలిపారు. మద్యం షాపుల వద్ద బహిరంగంగా మద్యం తాగకుండా, షాపుల్లో లూజు విక్రయాలు జరగకుండా నియంత్రిస్తామన్నారు. ప్రభుత్వం సీరియస్‌గా ఉందని చెప్పారు. షాపు యజమానులను హెచ్చరిస్తూనే ఉన్నామని, ఎలాంటి అక్రమాలను ఉపేక్షించేది లేదని సీఐ వివరించారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై ఫిర్యాదు

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీన జరుగనున్న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పోటీ చేస్తున్న సంగతి విదితమే. ఎన్నికలు పోటాపోటీగా జరుగుతున్న తరుణంలో గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా వేదికలలో కొందరు వ్యక్తులు దురుద్దేశ్యంతో కె.ఎస్.లక్ష్మణరావుపై దుష్ప్రచారం చేస్తున్నారని కె.ఎస్.లక్ష్మణరావు ఎలక్షన్ చీఫ్ ఏజెంట్, సీనియర్ న్యాయవాది సప్పా రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది సంవత్సరాల క్రితం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డికి ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తమై వినతిపత్రం ఇవ్వబోగా, కిందపడిన కాగితాలను తీయడానికి కిందకు వంగిన కె.ఎస్.లక్ష్మణరావు వీడియోలను జగన్మోహనరెడ్డి పాదాలపై పడిన లక్ష్మణరావు అని ఓటర్లలో గందరగోళం సృష్టించి లబ్ధి పొందాలనే దురుద్దేశ్యంతో కొంతమంది సోషల్ మీడియా వేదికలలో దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులైన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని సోమవారం ఎమ్మెల్సీ లక్ష్మణరావు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

కె.ఎస్.లక్ష్మణరావు గతంలో మూడు పర్యాయాలు శాసనమండలి సభ్యులుగా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేశారని, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) సభ్యుడిగా మచ్చలేని ప్రజా జీవితం గడిపారని రమేష్‌బాబు తెలిపారు. కానీ కొంతమంది రాజకీయ, వ్యక్తిగత లబ్ధి కోసం ఆయనపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

అలా దుష్ప్రచారం చేస్తున్న వారిపై తగిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారణ జరిపి నిందితులపై తగు చర్య తీసుకోవాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, ఏపీ డీజీపీ, గుంటూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు రమేష్‌బాబు తగు ఆధారాలతో సోమవారం ఫిర్యాదు చేశారు.

ఇన్నర్‌తోనే ఇక్కట్లకు చెక్!

(5వ పేజీ తరువాయి)

అనుసంధానించేలా అయినా ఫేజ్ - 1 పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ చక్రబంధంలో విజయవాడ

అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రస్తుతం కీలక నగరాలుగా విజయవాడ, గుంటూరు ఉన్నాయి. గుంటూరు కంటే కూడా విజయవాడ భౌగోళికంగా పెద్దది. జనసాంద్రత ఎక్కువ. రవాణా రంగానికి కేంద్రంగా ఉంది. రాష్ట్రంలోనే తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న నగరంగా విజయవాడ నిలుస్తోంది. నిత్యం ట్రాఫిక్ సమస్యలు గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఫ్లై ఓవర్లు నిర్మించినా అంతర్గత ట్రాఫిక్ పెరిగిపోవటంతో ట్రాఫిక్ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. విజయవాడ మీదుగా బయటి నుంచి వచ్చే వాహనాల రాకపోకలను ఎంత మేర నియంత్రించ గలిగితే అంత మేర నగరంపై ట్రాఫిక్ ప్రభావం తగ్గుతుంది. ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోకపోతే రానున్న రోజుల్లో విజయవాడ నగరం ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుంటుంది.

తూర్పు బైపాస్‌కు ప్రత్యామ్నాయం అవసరం

విజయవాడలో అంతర్గత ట్రాఫిక్‌ను, బయటి నుంచి వచ్చే భారీ వాహనాల ట్రాఫిక్‌ను తగ్గించటానికి విజయవాడ వెస్ట్ బైపాస్ కొంత మేర ప్రత్యామ్నాయంగా ఉంది. దీనికి అనుసంధానంగా విజయవాడ తూర్పు బైపాస్‌ను నిర్మిస్తేనే మచిలీపట్నం - హైదరాబాద్, మచిలీపట్నం - బెంగళూరు, విశాఖపట్నం - చెన్నై, విశాఖపట్నం- బెంగళూరు మార్గాలలో విజయవాడ మీద పడే ట్రాఫిక్‌ను నూటికి తొంభై శాతం వరకు నివారించటానికి అవకాశం ఉంటుంది. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు ఎలాగూ మరో నాలుగైదు నెలల్లో పాక్షికంగా గొల్లపూడి వరకు ముందుగా అందుబాటులోకి వస్తుంది. తూర్పు వైపున కూడా బైపాస్ వస్తేనే శాశ్వతంగా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టడానికి అవకాశం ఏర్పడుతుంది. తూర్పు బైపాస్ లేదంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్నర్ రింగ్‌రోడ్డును అయినా ఈ సమయంలో ముందుకు తీసుకువస్తే విజయవాడకు శాశ్వతంగా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

ఇన్నర్ అలైన్‌మెంట్ మీదుగా డైవర్షన్ ప్రాంతాలు

ఇన్నర్‌తో ఎన్‌హెచ్- 16, గ్రేటర్ విలీన ప్రాంతాలపై ఒత్తిడి తగ్గించే ప్రాంతాలు

నగరంతోపాటు విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలు కూడా అంతర్గత ట్రాఫిక్ సమస్యల ప్రభావాన్ని చవిచూస్తున్నాయి. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రధానంగా ఎన్‌హెచ్-16 మీద పడే భారాన్ని తగ్గించటానికి అనేక కీలకమైన పాయింట్లు ఉన్నాయి. ఈ మార్గంలో నిడమానూరు దగ్గర ఇన్నర్ టచ్ అవుతుంది. నిడమానూరు జంక్షన్‌కు పైనుంచి అంటే గూడవల్లికి సమీపం నుంచి వెళుతుంది. ఏలూరు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు, ఇతర ట్రాఫిక్ ఇటు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డులోకి వెళ్తాయి. దీంతో విజయవాడపై ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయి. ఎన్‌హెచ్-65పై పడే ట్రాఫిక్ రద్దీని నివారించటానికి పోరంకి, పెనమలూరు మీదుగా సాగే ఇన్నర్ అలైన్‌మెంట్ ద్వారా డైవర్షన్ అవుతుంది. పోరంకి, పెనమలూరు సెంటర్ మధ్యలో ఒక జంక్షన్ ఏర్పడుతుంది. ఈ జంక్షన్ కారణంగా విజయవాడలో పటమట నుంచి ఆటోనగర్, కానూరు, తాడిగడప, పోరంకి తదితర ప్రాంతాలు ఇన్నర్ ట్రాఫిక్ కూడా ఇన్నర్ అలైన్‌మెంట్ మీదుగా డైవర్షన్ కావటానికి అవకాశం ఉంటుంది. మరో జాతీయ రహదారి అయిన విజయవాడ - ఛత్తీస్‌గఢ్ మార్గంలోని ఎన్‌హెచ్ - 30 మీద ఇబ్రహీంపట్నం, కొండపల్లి మీదుగా వెళ్లే ట్రాఫిక్‌ను ఐఆర్ఆర్ మీదుగా డైవర్షన్ చేయటానికి అవకాశం ఉంటుంది.

ఎన్టీఆర్ జిల్లాలో వెస్ట్ బైపాస్‌కు ఎగువున..

కృష్ణాజిల్లాలో తూర్పు బైపాస్‌కు దిగువున..

ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ వెస్ట్ బైపాస్ ఎగువున ఇన్నర్ రింగ్ రోడ్డు వస్తుంది. విజయవాడ వెస్ట్ బైపాస్ అనేది ఎన్‌హెచ్-65పై గొల్లపూడి బయట అనుసంధానం అవుతుంది. అదే ఇన్నర్ రింగ్ రోడ్డు అయితే ఇబ్రహీంపట్నం, కొండపల్లి మీదుగా వెళుతుంది. ఇలా డైవర్షన్ అయిన వాహనాలు తిరిగి నున్న దగ్గర విజయవాడ వెస్ట్ బైపాస్‌లోకి వస్తాయి. వెస్ట్ బైపాస్ మీదకు చేరిన వాహనాలు చిన్న అవుటపల్లిలో ఎన్‌హెచ్-16కు అనుసంధానమవుతాయి. కృష్ణాజిల్లాలో విజయవాడ ఈస్ట్ బైపాస్ అలైన్‌మెంట్ కంటే కూడా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ దిగువున ఉంటుంది. అందువల్ల ఈస్ట్ బైపాస్ లేని కొరతను ఇన్నర్ రింగ్ రోడ్డు మాత్రమే తీర్చగలదు.



కంటి కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

● ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అనూష గంగూలీ

పెనమలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కంటి కేన్సర్‌పై మరింత అవగాహన పెంచుకోవాలని తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అనూష గంగూలీ తెలిపారు. సోమవారం ఆసుపత్రి ఆవరణలో కంటి కేన్సర్‌పై అవగాహన, సవాళ్లు, చికిత్స అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చాలామంది కేన్సర్ ఊపిరితిత్తులు, రొమ్ము, చర్మానికి సంబంధించినదని మాత్రమేనని అనుకుంటారని, కాని కేన్సర్ కళ్లను కూడా ప్రభావితం చేస్తుందని, కంటి కేన్సర్‌తో శాశ్వతంగా చూపును కోల్పోయే ప్రమాదం ఉందని, ముఖ్యంగా కంటి క్యాన్సర్ చిన్నపిల్లల్లో ఎక్కువగా వస్తుందన్నారు. పిల్లల్లో ప్రాణాంతకమైన రెటీనో బ్లాస్టమా కేసులు ఆసియా ప్రాంతంలోనే అధికంగా ఉన్నట్లు తెలిపారు.

శోభాయమానంగా శివాలయాలు

- మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారు జామునుంచే అభిషేక పూజలు
- ప్రత్యేక అలంకారంలో దర్శనమివ్వనున్న స్వామివారు
- భక్తులకు అసౌకర్యం కలగకుండా పక్కా ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా బాపులపాడు మండలంలోని శివాలయాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. కానుమోలులో ఇటీవలే పునఃనిర్మించబడిన సోమేశ్వరస్వామి దేవస్థాన ముఖద్వారం, ఆలయం, బంగారువర్ణంలో మెరిసిపోతూ మహాశివరాత్రి పర్వదినానికి సిద్ధమవుతున్నాయి. మడిచర్లలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి దేవాలయానికి మహాశివరాత్రి సందర్భంగా విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సందర్భంగా మల్లికార్జున స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరవల్లి, చిరివాడ, సింగన్నగూడెం, తదితర గ్రామాల్లోని శైవాలయాలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. తెల్లవారుఝామున ప్రత్యేక అభిషేక పూజలు, రాత్రి 7గంటలకు లోకకల్యాణం కోసం శాంతికల్యాణం, రాత్రి 11గంటలకు లింగోద్భవకాల అభిషేక పూజలు నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వివరించారు.



ముస్తాబైన పెరికీడు ముక్తేశ్వరాలయం

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

గన్నవరం : స్థానిక కోనాయి చెరువు సమీపంలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26న జరగనున్న మహాశివరాత్రి మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 26 తెల్లవారుఝాము నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం 6.30 గంటలకు సుముహూర్తంలో ఆది దంపతులకు శాంతి కళ్యాణం, అర్ధరాత్రి 12.01 గంటలకు లింగోద్భవకాలంలో స్వా మివారికి అన్నాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. స్వామివారి శాంతి కల్యాణాన్ని వీక్షించాలని కోరారు. కొణ సాని నాగేశ్వరరావు, జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని శ్రీనివాసరావు, నర్రా అనిల్‌కుమార్, కాట్రగడ్డ రామశేషు, జాస్తి వెంకటేశ్వరరావు, గూడపాటి సీతారాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బాపులపాడులో బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వరుడు

హనుమాన్‌జంక్షన్ : మహాశివ రాత్రి పర్వదినం పురస్కరించుకొని స్థానిక బాపులపాడు ధర్మకోసేరు శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వరాలయాన్ని భక్తుల రద్దీకి అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని బ్రహ్మసూత్రధారిగా భక్తులకు దర్శనం ఇచ్చే మరకత (ఆకుపచ్చ) పరమ శివుడి లింగం ఇక్కడ గతేడాది ప్రతిష్టించారు. మహాశివ రాత్రి వేడుకను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా తెలిపారు. శివరాత్రి రోజున విశేష అభిషేకాలు, దీపార్చన,శాంతి కల్యాణం, ఏకవార రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శివరాత్రి ఏర్పాట్లు

కంకిపాడు : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామా ల్లోని శివాలయాలు ముస్తాబ వుతున్నాయి. కంకిపాడు శివాలయంతో పాటు ఈడుపు గల్లు, ఉప్పలూరు, మద్దూరు ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్‌లోని శివాలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి.



బాపులపాడు శివాలయం

చార్ట్ కౌన్సెలింగ్ ప్రక్రియ నిలుపుదల



● దీక్షలు విరమించిన పీటీడీ ఉద్యోగులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో కేంద్ర కార్యాలయ సర్క్యులర్‌కు వ్యతిరేకంగా జరిగిన చార్ట్ కౌన్సెలింగ్ ప్రక్రియ నిలుపుదల చేస్తూ జిల్లా ప్రజా రవాణా అధికారి ఆదేశాలివ్వడంతో స్థానిక బస్టాండ్ ఆవరణలో ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో పీటీడీ ఉద్యోగులు పది రోజులుగా చేస్తున్న రిలేదీక్ష సోమ వారం విరమించారు. తమ ఉద్యమానికి వెన్నం టి ఉండి ప్రోత్సహించి సంఘీభావం తెలిపిన నాయకులకు మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

కరాటేలో సాయిశ్రీవల్లికి బంగారు పతకం

ఉయ్యూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా కరాటే - డు చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో శ్రీవిశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 8వ తరగతి విద్యార్థిని జంపాన సాయిశ్రీవల్లి బంగారు పతకం కైవసం చేసుకుంది. చిలకలూరిపేటలో డబ్ల్యూ ఎల్ కెఎఫ్ఎస్ కరాటే - డు అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యాన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్ ఇండియా కరాటే- డు చాంపియన్ షిప్ పోటీల్లో 14 సంవత్సరాల లోపు 45-50 కేజీల విభాగంలో శ్రీవల్లి బంగారు పతకం సాధించింది. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల అధినేత మాదాల సుబ్రమణ్యేశ్వరరావు, జేడీ ఫౌండేషన్ ప్రతినిధి అనగాని రామ్‌ప్రసాద్‌తో పాటు పలువురు అభినందించారు.



సాయి శ్రీవల్లిని అభినందిస్తున్న శ్రీవిశ్వశాంతి అధినేత మాదాల

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

ఉయ్యూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పెదఓగిరాల గ్రామ శివారులో పేకాడుతున్న ఆరుగురిని సోమవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 21వేల నగదు, 3 మోటార్ సైకిళ్లు స్వాధీనపరచుకుని కేసు నమోదు చేసినట్టు ఉయ్యూరు రూరల్ ఎస్సై కె సురేశ్‌బాబు తెలిపారు. పేకాట, కోడిపందేలు నిర్వహించే వారిపైన, పందేలు వేసే వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, గ్రామస్తులు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

సైన్స్‌పై అవగాహన పెంచాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సైన్స్‌పై విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకు ఉండాలని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డు మానవత కార్యాలయంలో జాతీయసైన్సు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా విశ్రాంతి ఉపాధ్యాయులు నిడమర్తి లలితాకామేశ్వరి, కొట్నేని రామచంద్రరావు, ఘంటా సత్యనారాయణ వ్యవహరించారు. గణేశ్‌బాబు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



చిరివాడలో ప్లాస్టిక్ వినియోగం అనర్థాలపై అవగాహన ర్యాలీ

సమష్టి భాగస్వామ్యంతో ప్లాస్టిక్ కట్టడికి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : పర్యావరణంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్ వినియోగం కట్టడి సమష్టి భాగస్వామ్యంతో మాత్రమే సాధ్యమని ఉషారామ ఇంజనీరింగ్ కాలేజీ ఎన్.ఎస్.ఎస్ విభాగం అఫీసర్ వి.హరిబాబు ప్రజలకు సూచించారు. చిరివాడ సర్పంచ్ అశోక్ అధ్యక్షతన ఉషారామా ఇంజనీరింగ్ కాలేజీ ఎన్.ఎస్.ఎస్ విభాగం విద్యార్థులు సోమవారం ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్, విద్యార్థులు పాల్గొన్నారు.

200 మందికి హోమియో వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మం డపంలో సోమవారం జంక్షన్ ఆర్యవైశ్య సేవా ట్రస్టు, విజయవాడ నరేశ్ హోమియో స్టోర్సు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మంది రోగులకు పరీక్షలు జరిపి మందులను ఉచితంగా అందజేసినట్లు ట్రస్టు నిర్వాహ కులు బొమ్మిశెట్టి రామారావు తెలిపారు. విజయవాడ హోమియో వైద్యనిపుణులు దుబాషి రమేశ్, సుభాషిణి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘం నేతలు కొనకళ్ల రాజశేఖర్, వెచ్చా వెంకటేశ్వరరావు, చామర్తి రాంబాబు, పైడి సుధాకర్, గార్లపాటి రామకృష్ణ, కంభంపాటి శ్రీనివాసరావు చామర్తి లోక్‌నాథ్ తదితరులు పర్యవేక్షించారు.

ప్రపంచవ్యాప్తంగా ఏఐకు డిమాండ్

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో ప్రత్యేక నైపుణ్యాలు కలిగివున్నవారికి స్కిల్స్ ఆధారిత ఉద్యోగాల్లో మంచి డిమాండ్ వుందని, ప్రముఖ ఐబీఎం(ఎంఎన్‌సీ సాఫ్ట్‌వేర్)కంపెనీ ప్రతినిధి. ఎన్.శ్రీకాంత్(హైదరాబాద్) అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ థర్డ్ ఇయర్ విద్యార్థులకు ఐబీఎం అండ్ నాస్కామ్ ఆధ్వర్యంలో ఏఐ ఫండమెంటల్స్, ఉపయోగాలపై రెండు రోజులపాటు జరిగే వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి బి.నాంచారయ్య వర్క్‌షాప్ సమన్వయకర్త వీవీ ధర్మరాజన్, కో-ఆర్డినేటర్లు ఎంకే కిషోర్, టి.శ్రీధర్ పర్యవేక్షించారు.



మామిడి పూతను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి హరిచంద్

నల్ల తామర పురుగులను నివారించాలి

గన్నవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు నల్ల తామర పురుగుల నివారణ కోసం తగిన చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని హార్టీకల్చర్ అధికారి వి.హరిచంద్ తెలిపారు. మండలంలోని గోపవరపుగూడెంలో మామిడి తోటలను సోమ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరిచంద్ మాట్లాడుతూ, మామిడిలో పూత 80 నుంచి 90 శాతం వరకు అధికంగా రావటంతో జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఎక్కువగా ప్రబలిన నల్ల తామర పురుగులు, బూడిద తెగులు కారణంగా పూత నల్లగా మాడి పోవటం, వాడిపోవటం జరిగిందన్నారు. నల్ల తామర పురుగుల నివారణకు మందులను పిచికారి వివరించారు. హార్టికల్చర్ అసిస్టెంట్ దీక్షా, రైతులు నల్లూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యవర్గం

ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యవర్గం

ఉయ్యూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ఇన్నర్‌వీల్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రామకృష్ణ రిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నర్రా సుధారాణి, కార్యదర్శి అన్నేరాణి, ట్రెజరర్ సూర్యకుమారి, ఎడిటర్ ఉమాదేవి, ఐఎస్‌వోగా ఉషారాణి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : 33/11కేవీ ఉంగుటూరు సబ్‌స్టేషన్ పరిధిలోని తరిగొప్పల ఫీడర్ లైన్ల మరమ్మతులు మంగళవారం చేపట్టనున్నారు. ఈ కారణంగా వెల్దిపాడు, వేంపాడు, తరిగొప్పల గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు.

పరీక్ష సామగ్రి అందజేత

పెనమలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని అన్నే శివనాగేశ్వరరావు, అరుణ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కన్వీనర్ శివనాగేశ్వరరావు పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడ్స్, పెన్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సమస్యలు పరిష్కరించడంలో అనుభవజ్ఞుడైన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. టీడీపీ విజయవాడ రూరల్ మండల గొడ్డళ్ల చిన రామారావు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసాదంపాడులోని వివేకానందన కాన్సెప్ట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్వహించిన సమావేశానికి యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటికి వేసి విజయం చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి విప్ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ ప్రసాదంపాడు గ్రామాధ్యక్షుడు రమణ, నాయకులు గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ గుజ్జర్ల బాబూరావు, సర్నాల బాలాజీ, వడ్రాణం హరిబాబు, నెక్కంటి శ్రీదేవి, జనసేన నాయకులు పొదిలి దుర్గారావు, అల్లిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని శాసన మండలికి పంపించాలని ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కేసరపల్లిలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం రాత్రి ప్రచారం చేశారు. నాయకులు పలగాని బాలకృష్ణ, సుధాబత్తుల రామకృష్ణ, జూపల్లి సురేష్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, మండవ లక్ష్మీ, దేవినేని సులోచన రాణి, చిట్టూరి వెంకటేష్, చిక్కవరపు నాగమణి, బొర్రా సాయి, వల్లూరి విజయ్ మాధవ్, రాజులపాటి శ్రీనివాసరావు, ఎర్రగని రత్తయ్య, కోసూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదంపాడు వివేకానంద హైస్కూల్లో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : నిరుద్యోగుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ అధ్యక్షుడు యనమదల వెంకయ్యారావు, ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. మల్లవల్లిలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి మద్దతుగా మోడల్ బ్యాలెట్ పేపర్‌ను పంపిణీ చేస్తూ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కలపాల కుమార్, అక్కినేని కృష్ణాజీ, మాజీ ఎంపీటీసీ షేక్ జాన్‌బాషా, తమ్మిశెట్టి రాంబాబు, మీర్జావలి, గోవింద్, సయ్యద్ ఖాలీషా తదితరులు పాల్గొన్నారు.

వివాహితను వేధించిన నిందితుడి అరెస్టు

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : వివాహితను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపిన సంఘటన ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెదఅవుటపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వివాహిత ఈ నెల 21న గన్నవరం సమీపంలోని ఓ ఫంక్షన్‌హాలులో జరిగిన పెళ్లి వేడుకకు క్యాటరింగ్ పని నిమిత్తం వెళ్లింది. పని ముగించుకుని అర్ధరాత్రి సుమారు 12.30గం.ల సమయంలో ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం రోడ్డు మీద ఎదురుచూస్తుండగా అదే గ్రామానికి చెందిన కలపాల కిరణ్(32) ఆ మహిళను ఇంటివద్ద దింపుతానని నమ్మించి బైక్ ఎక్కించుకున్నాడు. దగ్గరి దారి అని చెప్పి శ్రీనివాస హేచరీస్ పక్కనున్న వెంచర్లో నిర్మానుష్యంగా వున్న ప్లాట్స్‌లోకి తీసుకెళ్లి ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఊహించని పరిణామానికి భయకంపితురాలైన మహిళ అతడినుంచి తెలివిగా తప్పించుకుని ఇంటికి చేరింది. జరిగినదంతా కుటుంబ సభ్యులకు వివరించి, వారి సహకారంతో శనివారం ఉదయం ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసిన ఏఎస్సై ఆంజనేయులు దర్యాప్తులో భాగంగా సోమవారం కిరణ్‌ను అదుపులోకి తీసుకుని అతడి బైక్‌ను కూడా సీజ్‌చేశారు. అనంతరం నిందితుడిని గన్నవరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో కిరణ్‌ను స్థానిక సబ్‌జైలుకు తరలించారు.



మత్తు పదార్థాల వినియోగంపై అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్న నీతోడు మానసిక వికాసకేంద్రం ప్రతినిధులు

మత్తుకు విద్యార్థులు దూరంగా ఉండాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా వుండాలని నీతోడు మానసిక వికాస కేంద్రం, విజయవాడ, నూజివీడు జోనల్ కో-ఆర్డినేటర్లు ఎస్.జాకబ్‌రాజు, షేక్ నజ్మా, డి.విజయరాణి అన్నారు. విజయవాడ నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పెదఅవుటపల్లి జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన బాలలు, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణస్థితికి తీసుకొచ్చేందుకు నవజీవన్ బాలభవన్ సంస్థ నూజివీడు మండలం, పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కో-డీ-ఎడిక్షన్ కేంద్రాన్ని సంప్రదించి ఉచితంగా వైద్యసాయం పొందాలన్నారు. వివరాలకు 9490 492020 నెంబర్లో సం ప్రదించాలని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.శేషకుమారి, ఏహెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదిత్యలో న్యాయవిజ్ఞాన సదస్సు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల హక్కులకు భంగం కలిగిన సందర్భంలో వాటిని కాపాడుకునే విధంగా చట్టంలో రూపొందించిన న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు జిల్లా న్యాయ సేవా విభాగం ప్రతి నిధి అడ్వకేట్ జి. వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక అదిత్యా బధిర విద్యాలయంలో ఏలూరు జిల్లా న్యాయ సేవా అథారిటీ, వట్లూరు పీహెచ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ, పాఠశాల కరస్పాండెంట్ ఇమంది అన్నపూర్ణ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కృష్ణారావు, హనుమాన్, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నేటి బాలబాలికలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే స్ఫూర్తి ప్రదాతలు అవ్వ, తాతయ్యలని శ్రవంతి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక గుడివాడ రోడ్డులోని విశ్వకవి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సోమవారం గ్రాండ్ పేరెంట్స్‌డే ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సత్యప్రసాద్, వీరమాచనేని శ్రీదేవి, గ్రామ ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

మినీ కోటప్పకొండ.. మల్లయ్య కొండపర్వగట్టు



విస్సన్నపేట: పల్నాడు జిల్లాలో ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం కోటప్పకొండ తరహాలోనే ఎన్టీఆర్ జిల్లాలోనూ కొండపర్వగట్టు ఉంది. మినీ కోటప్పకొండగా ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ శ్రీ భమరాంభింకా మల్లేశ్వరస్వామి (మల్లయ్య రూపం) కొండపర్వపై కొలువై ఉన్నారు. కొండపర్వ మల్లయ్య స్వామిని మొక్కుకుంటే తీరని కోర్కెలు తీరతాయని, ప్రసిద్ధి. సుమారు 70 ఏళ్ల క్రితం ఏలూరు జిల్లా నూజివీడు, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలకు మధ్యలో ఉన్న కొండపర్వ గ్రామంలో కొంగగట్టుపై శ్రీ భ్రమరాంభికా మల్లేశ్వర స్వామి (మల్లయ్య స్వామి) స్వయంభువుగా వెలసినట్లు స్థానికులు చెబుతుంటారు. సమీపంలోని చిత్తపూర్‌కు చెందిన కొందరు మేకల కాపరులకు మల్లయ్య స్వామి దర్శనమిచ్చారని అప్పటి నుంచి పూజలు చేయడం ప్రారంభించారు. ఏడాది పాటు చిత్తపూర్ గ్రామస్థులు తిరునాళ్ల నిర్వహించారు. రెండో ఏడాది నుంచి కొండపర్వకు చెందిన గ్రామస్థులే స్వామి కల్యాణం నిర్వహించేవారు. అప్పటి నుంచి గ్రామస్థులే వైభవంగా తిరునాళ్లు నిర్వహించారు. ప్రస్తుతం గొట్టిపూళ్ల బుచ్చి వెంకట్రామ లక్ష్మీ నరసింహారావు (బుచ్చిబాబు) ట్రస్టీగా ఉన్నారు.

ఉత్తరవాహినిలో పుణ్యస్నానం



పడమటి కనుమల్లో పుట్టిన కృష్ణమ్మ వడివడిగా ముక్త్యాలకు ఎగువన ఉత్తరంగా దిశను మార్చుకుని ముక్త్యాల వద్దకు రాగానే తూర్పుగా ప్రవహిస్తుంది. అందుకే ఇక్కడ కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రసిద్ధి. మహా శివరాత్రికి ముక్త్యాల క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా వస్తారు. ఉత్తరవాహినిలో పుణ్యస్నానం చేస్తే కాశీలో పుణ్యస్నానం చేసిన ఫలితం వస్తుందని పురాణ ఉవాచ. 26న శివరాత్రి సందర్భంగా భవానీ ముక్తేశ్వర స్వామి, కోటిలింగాల అమృతలింగేశ్వర స్వామి ఆలయాలను సిద్ధం చేశారు. కృష్ణానదిలో ఇబ్బందులు లేకుండా జల్లు స్నానాలు, రక్షణకు పడవలు ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు, కోటిలింగాలలో షామియానాలు ఏర్పాటు చేశారు. కేసీపీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేస్తారు. పుణ్యస్నానాలు, మొక్కులు తీర్చుకోవటం, పితృతర్పణ తీర్చుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వాహనాల్లో వస్తారు. దీంతో పోలీసులు విధించే ఆంక్షలతో భక్తులకు తిప్పలు తప్పేలా లేవు. నదికి కిలోమీటరు దూరంలోనే వాహనాలు నిలిపేస్తే వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఇబ్బందే. ఆర్టీసీ బస్సులను దొండపాడు మార్గం వరకు అనుమతించేలా చూడాలని కోరుతున్నారు.

శంభో శంకర

రేపు శివనామస్మరణతో మార్మోగనున్న శివాలయాలు

మహా శివరాత్రి మహోత్సవాలకు దేవాలయాల ముస్తాబు
త్రికాల, లింగోద్భవ అభిషేకాలు, శివ పార్వతుల కల్యాణం, హోమాలు, పుష్పయాగాలు
ప్రభల ఊరేగింపులు, రథోత్సవాలు, గ్రామోత్సవాలకు సిద్ధం



హరహర మహదేవ.. శంభోశంకర..! అంటూ శివనామస్మరణతో శివాలయాలు మారుమోగనున్నాయి. శివరాత్రి సందర్భంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు మహోత్సవాలకు సిద్ధమౌతున్నాయి. ఎంతో చరిత్ర గాంచిన ఇంద్రకీలాద్రి పైనున్న మల్లేశ్వరాలయం, దిగువునున్న విజయేశ్వరస్వామి ఆలయం, యనమలకుదురులోని రామలింగేశ్వరస్వామి ఆలయం, ధర్మరాజు ప్రతిష్ఠించినట్లు చెప్పబడుతున్న వన్‌టౌన్‌పాత శివాలయం.. మినీ కొటప్పకొండగా చెప్పుకునే విస్సన్నపేట శివారు కొండపర్వ మల్లయ్యస్వామి ఆలయం, ఐలూరులోని ఉభయ రామక్షేత్రం, పెదకళ్లేపల్లిలోని నాగేశ్వరక్షేత్రం, నందిగామ దగ్గర్లో ఉన్న సంగమేశ్వరస్వామి ఆలయంతో పాటు అనేక శైవాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబౌతున్నాయి. ఈ దేవాలయాల్లో త్రికాల అభిషేకాలు, లింగోద్భవ అభిషేకాలు, పార్వతీ శివ కల్యాణం, హోమాలు, పుష్పయాగాలు అన్నింటికి మించి ప్రభల ఉత్సవాలు కన్నుల పండువుగా నిర్వహించనున్నారు. వారం రోజులుగా రెండు జిల్లాల్లో శివరాత్రి మహోత్సవాల సందడి మొదలైంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్/విస్సన్నపేట, పెనమలూరు, తోట్లవల్లూరు, మోపిదేవి, ఇబ్రహీంపట్నం, నందిగామ రూరల్, జగ్గయ్యపేట రూరల్, బస్‌స్టేషన్



బెజవాడకు కంఠాభరణం ఇంద్రకీలాద్రి

విజయవాడ నగరానికి కంఠాభరణంగా నిలిచే ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరాలయం వెలిసి భక్తులకు అద్భుతమైన దైవ సన్నిధినంలో ప్రశాంతతను అందిస్తోంది. ప్రముఖ శక్తిపీఠమైన దుర్గమ్మ ఆలయ సమీపంలోని మల్లేశ్వర స్వామి ఆలయానికి చారిత్రక ప్రాధాన్యతతో పాటు పురాణ మహత్యం ఉంది. తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయంలోకి భక్తులు ఉత్తర దిశ నుంచి ప్రవేశిస్తారు. ప్రవేశ ద్వారంలో రౌద్రస్వరూపుడైన కాలభైరవుడు, నందీశ్వర దర్శనం లభిస్తాయి. పురాణ కథనం ప్రకారం కృతయుగంలో రాహన సంహారానంతరం రౌద్ర రూపిణిగా వెలిసిన దుర్గాదేవిని శాంతింపచేయడానికి దేవతలు మహాదేవుడిని ప్రార్థించారు. అక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించి బ్రహ్మదేవుడు మల్లికాపుష్పాలతో పూజించగా 'మల్లేశ్వరస్వామిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ దుర్గామల్లేశ్వరస్వామి అర్ధనారీశ్వర రూపంలో భక్తులకు దర్శనం ఇస్తాడు. 24 నుంచి శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 9 గంటలకు దుర్గామల్లేశ్వరులకు మంగళ స్నానాలు ఆచరించి వధూవరులుగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం 4 గంటలకు అంకురారోహణ, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపనతో ప్రారంభమై మార్చి 3 వరకు సాగుతాయి.

అర్జునుడి పవిత్రస్థలం.. విజయేశ్వరస్వామి ఆలయం



ఇంద్రకీలాద్రి కేవలం మల్లేశ్వరాలయానికే కాకుండా, ద్వాపర యుగానికి చెందిన మరో శివక్షేత్రానికి నిలయమైంది. కురుక్షేత్ర యుద్ధానికి ముందు అర్జునుడు పరమశివుడి కోసం కఠోర తపస్సు చేశాడు. అతడి భక్తిని పరీక్షించేందుకు శివుడు కిరాతక రూపంలో ప్రత్యక్షమై యుద్ధంచేసి ధైర్యశక్తులను అంచనా వేసి, భక్తికి మెచ్చి 'పాశుపతాస్త్రాన్ని' ప్రసాదించారు. ఆ విజయానికి గుర్తుగా అర్జునుడు ఇక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. అందుకే 'విజయేశ్వర స్వామి ఆలయం' గా పిలుస్తారు. ఇంద్రకీలాద్రిపై ఈ శైవక్షేత్రాలు భక్తులకు దివ్యానుభూతిని కలిగిస్తూ విజయవాడ నగరానికి మహాత్యాన్ని కలిగిస్తోంది.





వన్‌టౌన్ పాత శివాలయం



పాండవుల్లో ప్రథముడైన ధర్మరాజు ద్వాపర యుగంలో ప్రతిష్ఠించిన పురాతన శివాలయం శీ గంగా సమేత భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం. అనంతరం కాలంలో ఇప్పటివరకు పునఃప్రతి ష్ఠ జరగలేదు. 808వ సంవత్సరంలో మాధవవర్మ పరిపాలనలో దుర్గమ్మ మెచ్చి కనకవర్షం కురిపించినట్టు శాసనాలు చెబుతున్నాయి. వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి ఎంత ప్రాచీనమైందో అంతే ప్రాచీనమైన ఈ దేవాలయంలోనూ వేయి స్తంభాలున్నాయి. కాలక్రమేణా అవి కనుమరుగయ్యాయి. శ్రీశైలంలో ఇష్టంగా దర్శించుకునే ఇష్టకామేశ్వరి దే వాలయం ఇక్కడుంది. శివరాత్రి మరుసటిరోజు నిర్వహించే రథోత్సవంలో దుర్గామల్లేశ్వరస్వామి వార్లు, బ్రాహ్మణ వీధిలో వేంచేసిన శ్రీ వసంత మల్లిఖార్జున స్వామివారు, ఇక్కడికి చేరుకొని శ్రీ గంగా స మేత భ్రమరాంబ మల్లిఖార్జున స్వామితో కలిసి నగరోత్సవానికి బయలుదేరడం ఆనవాయితీ. ఇక్కడ శివలింగానికి బ్రహ్మసూత్రం ఉంటుంది. పంచభూతాలకు ప్రతీకగా మృత్యుంజయుడు, రామలింగేశ్వరుడు, కాశీ విశ్వేశ్వరుడు, మల్లేశ్వరుడు ఇలా శివుడు 5 రూపాల్లో దర్శనమిస్తాడు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం, శ్రీ సీతారామస్వామి దేవాలయం, అయ్యప్ప దేవాలయం, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం గణపతి దేవాలయం, వల్లీ దేవసేన సమేత షణ్ముఖద దేవాలయం దర్శనమిస్తాయి. శివరాత్రి ఉత్సవాల్లో భాగగా బ్రహ్మోత్సవం ఘనంగా జరుగుతుంది.

పవిత్ర సంగమంలో స్నానాలకు ఏర్పాట్లు



ఈనెల 26న మహా శివరాత్రి పుణ్యస్నానాలకు స్థానిక పవిత్ర సంగమంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గోదావరి - కృష్ణా నదులు కలిసిన సంగమ ప్రాంతంలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ ఉంటారు. ఫెర్రీ, పవిత్ర సంగమం రోడ్డులో, స్నానాల ఘాట్ వద్ద, ప్లాట్‌ఫామ్‌పై ఉన్న చెత్తాచెదారాన్ని పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లు చేయిస్తున్నారు. పిండ ప్రదానం చేసే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు, స్నానాలు చేసే మహిళా భక్తులు బట్టలు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం బయో టాయిలెట్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు శివాలయాలు శివరాత్రికి పర్వదినానికి ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. లక్ష మందికి పైగా స్నానాలకు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు. పవిత్రసంగమం వద్ద పుణ్య స్నానాలకు మైలవరం నుంచి 5, కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి 3, ఇబ్రహీంపట్నం రింగ్ నుంచి 2 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వేణు తెలిపారు. పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇక్కట్లు చూస్తామని, భక్తుల భద్రత విషయంలో నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.



మునిగిరిపై వెలసిన రామలింగేశ్వరస్వామి దేవాలయం

కృష్ణాజిల్లా యనమలకుదురు గ్రామంలోని మునిగిరి కొండపై శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం భక్తుల ఆరాధన కేంద్రంగా వెలుగొందుతోంది. ఈ దేవస్థానం పురాతనమైంది. శివుడు స్వయంభువుగా వెలిసినట్టు పురాణ గాథ. పురాణాల ప్రకారం పరశురాముడు ఇక్కడ శివుడిని ధ్యానించి తపస్సు చేయగా, వేయి మంది మునులు సమాహారంగా చేరి, శివుడి సేవిస్తూ మహాయజ్ఞాన్ని నిర్వహించినట్టు స్థల పురాణం. ఈ యజ్ఞాన్ని దుష్టశక్తుల నుంచి పరశురాముడు రక్షించాడని, యజ్ఞపరిపూర్ణమైన తరువాత శివుని ఆదేశంతో పరశురాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించాడని చెబుతారు. అందుకే దీన్ని 'వేయి మునుల కుదురు'గా పిలిచేవారు. కాలక్రమేణా 'యనమలకుదురు'గా మారింది. భూమికి 612 అడుగుల ఎత్తులో ఉన్న మునిగిరి కొండ ముఖద్వారంలో భక్తులకు అంగారక మహాశక్తిగా హనుమంతుడు దర్శనమిస్తాడు. గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు 3 రోజుల పాటు వైభవంతో నిర్వహిస్తారు.

రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

పార్వతీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఈనెల 25 నుంచి జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా ఆలయానికి రానున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పాలగ వర్గం ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ ఏర్పాట్లు చేసింది.

శైవ క్షేత్రాలకు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులు

ఈనెల 26న ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని డిపోల నుంచి శైవ క్షేత్రాలకు సుమారు 130 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు జిలా ప్రజారవాణ అధికారి ఎం.వై.దానం తెలిపారు. విజయవాడ నుంచి శ్రీశైలానికి ఆన్‌లైన్‌లో సీట్లు రిజర్వ్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. వివరాలకు సమీప బస్టేషన్లలో సంప్రదించవచ్చునన్నారు. కోటప్పకొండకు 43 బస్సులు, జగ్గయ్యపేట నుంచి ముక్త్యాలకు 23 బస్సులు, కోదాడకు 2, నందిగామ కూడలికి 2, తిరువూరు నుంచి నీలాద్రికి 15 బస్సులు, గుట్టపాడుకు 3, ఇబ్రహింపట్నం నుంచి పవిత్రసంగమానికి 2, మైలవరం నుంచి 5, కొండపల్లి నుంచి 3 బస్సులు నడుపనున్నారు. విజయవాడ నుంచి శ్రీశైలానికి 20 బస్సులు, అమరావతికి 13 బస్సులు, భీమవరానికి 2 బస్సులు, మొత్తం 90 బస్సులు నడపనున్నట్టు తెలిపారు.



మహిమానిత్వం.. పెదకళ్లేపల్లి క్షేత్రం

కృష్ణా నదితీరాన పవిత్ర శైవ క్షేత్రాల్లో పెదకళ్లేపల్లి క్షేత్రం ఒకటి. దీనిని అంబాపురమని, నాగేశ్వర క్షేత్రమని, కర్కోటక క్షేత్రమని పిలుస్తారు. క్రీస్తుశకం 1292లో సోమశివాచార్యులచే నిర్మించబడినట్టు శాసనాల్లో ఉంది. 1782లో చల్లపల్లి ప్రభువులు శ్రీ రాజా యార్లగడ్డ కోదండ రామన్న ఆలయానికి ప్రాకారాలు కట్టించారు. నేటికీ శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవాలయానికి చల్లపల్లి రాజా వంశీయులే ధర్మకర్తలుగా ఉన్నారు. ఇక్కడ స్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 9 రోజులు నిర్వహించనున్నారు. ఉత్సవాల చివరిరోజు చల్లపల్లి రాజా వంశీయులు ప్రారంభించి నిర్వహించే స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. పితృదేవతల కు పిండ తర్పణం గావిస్తారు.

ఐలూరులో ఉభయ రామక్షేత్రం



కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం ఐలూరు దక్షిణకాశీగా, ఉభయ రామక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. నందీశ్వరుడు, అమ్మవారు లేని ఆలయంగా ఉంది. త్రేతాయుగంలో రావణ సంహారానంతరం సీతాసమేతంగా శ్రీరాముడు అయోధ్యకు పుష్పక విమానంపై బయలుదేరాడు. అదే సమయంలో ఐలూరు సమీపంలో రైభ్యుడనే ముని తపస్సు చేస్తుండేవాడు. ఆ ముని తపఃప్రభావంతో ఈశ్వరుడు ప్రతక్షమై నీ కోరిన నెరవేరుతుందని వరమిస్తాడు. శ్రీరాముడు ప్రయాణిస్తున్న పుష్పక విమానం చిలుమూరు సమీపంలో కృష్ణానది వద్ద ఆగిపోతుంది. కారణం తెలియక శ్రీరాముడు వ్యధ చెందుతుండగా, ఆ ముని శ్రీరాముడి వద్దకు వచ్చి ఇచ్చట శివలింగం ప్రతిష్ఠించాలని తెలియజేస్తాడు. దాంతో శ్రీరాముడు హనుమంతుడిని శివలింగం తేమ్మని అయోధ్యకు పంపిస్తాడు. ఆయన వచ్చేలోపు సీతమ్మ ఇసుకతో సైకత లింగాన్ని చేస్తుంది. ముహూర్తానికి హనుమంతుడు రాకపోవటంతో చిలుమూరు వద్ద సైకత లింగాన్ని శ్రీరాముడు ప్రతిష్ఠిస్తాడు. కొద్దిసేపటికే వాయువేగంతో వచ్చిన హనుమంతుడు సైకత లింగాన్ని చూసి తన శ్రమ వృథా అయిందని కోపంతో రగిలిపోతాడు. హనుమంతుడిని శాంతింపజేసి అయోధ్య నుంచి తెచ్చిన శివలింగాన్ని శ్రీరాముడు స్వయంగా ఐలూరులో ప్రతిష్ఠిస్తాడు. అప్పుడు శివుడు శ్రీరాముడికి ప్రత్యక్షమై ఇది దక్షిణ కాశీగాను, ఉభయ రామక్షేత్రంగాను విలసిల్లుతుందని, కృష్ణానదిలో స్నానమాచరించి శివుడిని దర్శించుకుంటే కాశీ వెళ్లి గంగలో స్నానమాచరించనంత పుణ్యఫలం కులుగుతుందని, పక్కనే రఘునాయకస్వామి పేరుతో ఇక్కడే ఉంటానని అంతర్ధానమవుతాడు. రామేశ్వరస్వామి దేవస్థానం, రఘునాయకస్వామి దేవస్థానం రెండు పక్కపక్కనే ఉండటంతో ఉభయ రామక్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది. ఈ నెల 26న జరిగే మహాశివరాత్రికి జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ఐలూరు వస్తారని అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు చేపట్టారు. బారికేడ్ల నిర్మాణం, షామియానాల ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణానదీపాయలో నీరు లేకపోవటంతో జల్లు స్నానాలకు 4 బోర్లను సోమవారానికే సిద్ధం చేశారు. మచిలీపట్నం, ఉయ్యూరు ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు అధికారులు తెలిపారు.

కల్యాణోత్సవాలకు సంగమేశ్వరుడు సిద్ధం

దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న సంగమేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి తిరునాళ్లకు ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో నరసింహమూర్తి తెలిపారు. ఈ నెల 25 నుంచి 4 రోజుల పాటు స్వామి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. 25న స్వామిని పెండ్లి కుమారుడిని చేయటం, గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, 26న నిత్య ఔపోసన, రుద్రహోమం, బలిహరణ, హోమాలు, రాత్రి 10 గంటలకు ఎదురుకోలోత్సవం, కల్యాణం జరుగుతుందన్నారు. 27న రుద్రాభిషేకం, 28న పూర్ణాహుతితో ముగుస్తాయన్నారు.

పీహెచ్‌సీ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీహెచ్‌సీలో అనురాధ అనే ఉద్యోగిని సోమవారం పీహెచ్‌సీలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గత శనివారం ఓ అధికారి పీహెచ్‌సీకి వచ్చి వ్యాక్సిన్ నిల్వ ఉంచే ఐఎల్‌ఆర్ బాక్సులను తనిఖీ చేయగా ఒక వ్యాక్సిన్ బాక్సులో గేదెపాల సీసాలు వెలుగు చూశాయి. ఆ రోజు సదరు అధికారి ఎవరిని ప్రశ్నించినా తెలియదంటూ తప్పించుకున్నారు. దాంతో ఫార్మసిస్టుపై డీఎంఅండ్‌హెచ్‌వోకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించి వెళ్లారు. సోమవారం ఇదే అంశంపై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సిబ్బందిని ప్రశ్నించారు. దాంతో ఈ పాల సీసాలను అటెండర్ శ్రీమన్నారాయణకు ఇచ్చానని స్వీపర్ అనురాధ తెలపటంతో ఆ రోజే తప్పు ఒప్పుకుంటే ఫార్మసిస్టు నిందలు పడాల్సిన అవసరం ఉండేది కాదని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన అనురాధ ఫ్లోర్ క్లీనింగ్ ఫినాయిల్‌ని తాగింది. దాంతో సిబ్బంది, కుటుంబసభ్యులు వచ్చి 108లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

గ్యాస్ సిలెండర్లకు అదనంగా నగదు వసూలుచేస్తే చర్యలు

- డీఎస్‌వో పార్వతి

మచిలీపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందజేసే గ్యాస్ సిలెండర్లకు అదనంగా నగదు వసూలు చేసిన గ్యాస్‌ఏజెన్సీలపై కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్‌వో ఎ పార్వతి అన్నారు. తూనికలు కొలతలు, పౌర సరఫరాలశాఖ అధికారులు, గ్యాస్‌డీలర్లతో సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ సక్రమంగా జరుగుతున్నదీ, లేనిదీ ప్రభుత్వం ఐవీఆర్ సర్వే చేస్తోందన్నారు. ఉచితగ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు ఇచ్చే సమయంలో డెలివరీబాయ్‌లు అధికంగా నగదు వసూలు చేస్తున్నట్లుగా జిల్లా నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు అందుతున్నట్టు ఆమె తెలిపారు. రసీదులో ముద్రించిన ధర కన్నా అధికంగా నగదు వసూలు చేసినట్టు రుజువైతే గ్యాస్ ఏజెన్సీ లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఉచితగ్యాస్ సిలిండర్ల పంపిణీలో అధికమొత్తంలో నగదు వసూలుచేస్తే వినియోగదారులు 1967 నెంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గ్రూప్ 2 మెయిన్స్‌లో అమరావతి రైల్వే లైన్‌పై ప్రశ్న

వన్‌టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 175 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం జరిగిన గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలో ఆబ్జెక్టివ్ పేపర్-2లో అమరావతి రైల్వే లైన్ గురించి ప్రశ్న అడిగారు. ప్రాజెక్టు, ప్రతిపాదన కాలపరిమితి, పొడవు, వ్యయం, ఏపీ జిల్లాల గుండా వెళుతుందనే ప్రశ్నను అడిగారు. అయితే దాదాపుగా ఈ ప్రశ్నకు చాలా మందికి అవగాహన లేకపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇటీవలే ప్రభుత్వం అమరావతి రైల్వే లైన్‌ను ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక పనులు కూడా ప్రారంభం అయ్యాయి. తెలంగాణలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ రైల్వే లైన్ రానున్నది. మరోవైపు పేపర్-1లో విజయవాడలో ఒక చారిత్రక అంశానికి సంబంధించి ప్రశ్న అడిగారు. విజయవాడలో నెడుంబవసతి అనే జైన్ ఆలయాన్ని మహిళ అయ్యన మహాదేవి నిర్మించారు. అయితే ఆమె ఎవరి పట్టమహిషి అనే ప్రశ్న అడిగారు. సాయంత్రం వెలువడిన కీలో సమాధానంగా కుబ్జ విష్ణువర్ధనుడు అని సమాధానం ఇచ్చారు.

విజయవాడలో పోస్టర్లు నిషేధం

వన్‌టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడా గోడలపై పోస్టర్లు అంటించరాదని, నగరమంతా పోస్టర్ల రహితంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు జారీ చేశారు. బహిరంగ గోడలపై బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలను నిషేధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఒక ఆసుపత్రికి రూ.50వేలు జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల సుందరీకరణను భగ్నపరచడం, అందవిహీనంగా మార్చడం కింద 1997 యాక్ట్ 28 ప్రకారం నగరమంతా పోస్టర్ రహితంగా ఉంచాలన్నారు. ప్రజా ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నగర సుందరీకరణను కాపాడుకోవటంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ప్రహరీగోడలు, డివైడర్లు, కరెంటు స్థంభాలు, ట్రాఫిక్ ఐలండ్‌లు, ఫ్లైఓవర్‌లు, బ్రిడ్జిలు ఎక్కడా పోస్టర్లు అతికించరాదని స్పష్టం చేశారు. పోస్టర్లు అంటిస్తే ప్రకటనదారులు, ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్ నుంచి కూడా రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు. ఇప్పటికే పోస్టర్లు అతికించిన ప్రకటనదారులు, ముద్రించిన వారిని గుర్తించామన్నారు. వీరందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

మద్యం విక్రయాలు 48గంటలపాటు బంద్: కలెక్టర్

మచిలీపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనుండటంతో 48 గంటలపాటు జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేయాలని కలెక్టర్ బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న సాయంత్రం 4గంటలనుంచి 27న సాయంత్రం 4గంటల వరకు మూసివేయాలన్నారు. జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు నిబంధలను ఖచ్చితంగా అమలు జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

బర్డ్ ఫ్లూతో చికెన్ రేటు ధమాల్

- రూ. 250 నుంచి రూ. 170కు పడిపోయిన ధర
- ఖాళీగా చికెన్ షాపులు.. మటన్, చేపలకు పెరిగిన గిరాకీ

అజిత్‌సింగ్‌నగర్/పాయకాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ రేట్లు నేలచూపు చూస్తున్నాయి. చికెన్ తినేందుకు ఎవరూ ముందుకు రావడంతో ఆదివారం చికెన్ షాపులు వినియోగదారులు లేక ఖాళీగా వెలవెలబోతున్నాయి. చికెన్ ప్రియులు సైతం మటన్, చేపల వైపు మొగ్గుచూపడంతో వాటి ధరలు పెరిగిపోయాయి. కొంత మంది వెజిటేరియన్‌తో సరిపెట్టుకుంటున్నారు. బర్డ్‌ఫ్లూకు ముందు చికెన్ ధర కిలో రూ.250 ఉండగా ప్రస్తుతం రూ.170 పడిపోయింది. అంటే కిలోకు రూ.80వరకు ధర తగ్గడంతో అమ్మకాలు ఉంటాయని భావించినా వినియోగదారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. పైగా మటన్, చేపలపై మొగ్గు చూపడంతో వాటి ధరలు అమాంతం పెరిగాయి. బర్డ్ ఫ్లూకు ముందు మటన్ ధర కేజీ రూ.850 ఉండగా ప్రస్తుతం కేజీ రూ.1000కు చేరింది. ఇక చేపల విషయానికి వస్తే గతంలో కేజీ చేప రూ.130 ఉండగా గత ఆదివారం రూ.180 నుంచి రూ.200కు పెరిగింది. చికెన్ వ్యాపారాలు 80శాతం పడిపోయాయని, చాలా మంది మటన్, చేపలు, రొయ్యలపై మక్కువ చూపిస్తున్నారని, చికెన్ ధర తగ్గినా వినియోగదారుల్లో ఆ భయం అలాగే ఉండటంతో కొనుగోలుకు రావడం లేదని స్థానిక చికెన్ షాపు యజమాని రాంబాబు తెలిపారు.



ప్రకాష్‌నగర్‌లో ఖాళీగా ఉన్న చికెన్ షాపు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.480

అద్దంకి నాంచారమ్మ జాతర ప్రారంభం 28న

కోడూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరను ఈనెల 28 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారి జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 రోజులపాటు గ్రామోత్సవం నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలి పారు. ఆయలాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. 28న ఉదయం రామసీడు ఉత్సవం, చిన్న అమ్మవారిని ఆల యం నుంచి బయటకు తీసి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టనున్నట్లు జయశ్రీ తెలిపారు. గ్రామోత్సవంలో మార్చి 12న అమ్మవారి మూల విరాట్‌కి ప్రత్యేక అలంకారం, 13, 14 తేదీల్లో నాంచారమ్మ ప్రధాన జాతరను నిర్వహిం చనున్నట్లు తెలిపారు.



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ బాపిరాజు

మునిసిపల్ ఆఫీసు పక్కన ఆక్రమణల తొలగింపు

మరో ఆరు వారాల పాటు ఆక్రమణలు తొలగిస్తాం : కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థ కార్యాలయం పక్కన రోడ్డును ఆక్రమించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కమిషనర్ బాపిరాజు సారథ్యంలో ఆక్రమణలను పెద్ద ఎత్తున తొలగించారు. మునిసిపల్ కార్యాలయం పక్కన దశాబ్దాలుగా ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలు పర్యాయాలు ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు కమిషనర్ బాపిరాజు స్పందించారు. మునిసిపల్ కార్యాలయం పక్కన ఉన్న ఆక్రమణలను పోలీసు, రెవెన్యూ బలగాలతో తొలగించారు. ఆ ప్రాంతంలో వ్యాపార సంస్థల యజమానులు మామిడి మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యంలతో చర్చలు జరిపి వాస్తవాలను వివరించారు. ఆక్రమణల వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించారు. డ్రెయిన్లపై చిన్న చిన్న బడ్డీలను పెట్టడం వల్ల పారిశుధ్య కార్మికులకు మురుగునీరు తీసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీని వల్ల దోమలు పెరుగుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ ఆక్రమణలను మరో ఆరు వారాల పాటు కొనసాగిస్తామని కమిషనర్ మీడియాకు తెలిపారు. ఎంతటివారైనా ఉపేక్షించకుండా ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధు ల సలహాలు తీసుకుంటామని, అయితే చట్ట ప్రకారం చేసుకుపోతామన్నారు. బ్రిటీషు కా లం నాటి నుంచి మచిలీపట్నంలో విశాలమైన రోడ్లు ఉండేవని, ఆ రోడ్లు ఆక్రమణలకు గురయ్యాయయన్నారు. మాస్టార్ ప్లాన్ ప్రకారం ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. ప్రజలు ఇందుకు సహకరించాలన్నారు. కాగా, ఆక్రమణల తొలగింపునకు చొరవ తీసుకున్న కమిషనర్ బాపిరాజును చర్యలను సీనియర్/ సిటిజన్లు, న్యాయవాదులు అభినందించారు.

మచిలీపట్నంలో గత వారం రోజులుగా రోడ్డు పక్కన ఆక్రమణలను తొలగించడం మంత్రి కొల్లు రవీంద్రకు సవాలవుతోంది. రోడ్ల పైకి వచ్చిన ఆక్రమణలను ప్రజాశ్రేయస్సు దృష్ట్యా అధికారులు తొలగిస్తున్నామని చెబుతున్నారు. సుందరనగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముందుగా ప్రజలకు ఇబ్బంది కలిగించిన బైపాస్‌రోడ్డులోని ఫుడ్ కోర్టులను తొలగించారు. ఆ తరువాత జడ్పీ సెంటర్‌లోని ఆక్రమణలను తొలగించారు. రాజీవ్‌నగర్‌లో ఆక్రమణలను తొలగించారు. కరగ్రహారంలో ఇళ్లస్థలాలు ఇచ్చినప్పటికీ రాజీవ్‌నగర్‌లో రోడ్డు మార్జిన్‌లో నివసిస్తున్న వారి ఇళ్లను తొలగించారు. లక్ష్మీటాకీసు సెంటర్‌లోని ఆక్రమణలను తొలగించారు. మునిసిపల్ కార్యాలయం పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణల తొలగింపు మంత్రి కొల్లు రవీంద్ర ముందు ఒక సవాలవుతోందని, అయినప్పటికీ మచిలీపట్నంను సుం దర మచిలీపట్నంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం స్థిర నిర్ణయం తీసుకోవడంతో ఆక్రమణలు తొలగిస్తున్నారు.



రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వరస్వామి దేవాలయం



బచ్చుపేటలోని భ్రమరాంబ చెన్నమల్లికార్జున ఆలయం



సంగమేశ్వరాలయం



కోడూరులో సోమేశ్వరస్వామి

శివరాత్రికి ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రికి ప్రధాన శివాలయాలను ముస్తాబుచేస్తున్నారు. స్వామివార్ల దర్శనానికి భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనకు అన్ని ఏర్పాట్లు చేశారు. బచ్చుపేటలోని భ్రమరాంబాసమేత మల్లేశ్వరస్వామి, ఖొజ్జిలిపేట నాగేశ్వరస్వామి దేవాలయం ముస్తాబైంది. నాగులేరులో లక్షలాది భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. గొడుగుపేటలోని మల్లేశ్వరస్వామి, సర్కిల్‌పేటలోని మల్లికార్జునస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి.

సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నాగాయలంక : సంగమేశ్వరంలో కొలువైన గంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కొల్లిపర శివసాయి తిరుమల భార్గవ్ అర్చకత్వంలో నిర్వహిస్తున్నట్లు ఆయల కార్యనిర్వహణాధికారి సిహెచ్.సుధాకరరావు తెలిపారు. ఆలయాన్ని ముస్తాబు చేసి, ప్రాంగణంలో చలువ పందిళ్లను నిర్మించారు. 25వ తేదీ ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమార్తె, కుమారునిగా చేయుట, 26న జగజ్యోతి, స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, 27న రథోత్సవం, 28న వసంతోత్సవం, పవళింపు సేవ జరుగుతాయన్నారు. ఔత్సాహిక కళాకారులు సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తారన్నారు. దాతలు ఆర్థిక సాయంతో కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరుగుతుందన్నారు.

కోడూరులో..

కోడూరు : కోడూరులో సోమేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శిరామకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, రాత్రి 7 గంటలకు పార్వ తీ సహిత సోమేశ్వరస్వామి దివ్య కల్యాణం, రాత్రి 10.30 నుంచి లింగోద్భవకాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సకలేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



మోపిదేవి : మోపిదేవిలో స్వయంభువుగా కొలువై ఉన్న గంగాపార్వతీ సమేత సకలేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఎదుర్కోలు ఉత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈవో జె.ప్రవీణ నూతన పట్టువస్త్రాలు సమర్పించగా, అర్చక బృందం వేదమంత్రాల నడుమ కలాణ మహోత్సవాన్ని జరుపగా, భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించారు. ఆలయ సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యార్లగడ్డ పుట్టతీర్థం ముస్తాబు



చల్లపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తీర్థము-క్షేత్రము కలిసిన పుణ్యక్షేత్రంగా యార్లగడ్డ పుట్టతీర్థం ప్రాశస్త్యం పొందింది. యార్లగడ్డలో వెలిసిన శ్రీనాగేంద్రస్వామి పుట్ట, గంగా పార్వతీ సమేత నాగమల్లి కోటీశ్వరస్వామి ఆలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాయి. యార్లగడ్డలోని నాగేంద్రస్వామి పుట్ట మహిమాన్వితమైనదిగా భక్తులు విశ్వసిస్తారు. నాగపుట్టలో పాలుపోసేందుకు యార్లగడ్డ పరిసర గ్రామాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచీ భక్తులు తరలివస్తారు. నాగమల్లి కోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులతో పాటు ప్రత్యేకించి పెద్దఎత్తున పశుపోషకులు వస్తారు. పశుసంపదను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తే పశుసంపద వృద్ధి చెందుతుందనే నమ్మకంతో మేకలు, గొర్రెలు, పశువులను ఆలయం చుట్టూ తిప్పుతారు. శివరాత్రి ఉత్సవానికి యార్లగడ్డ పుట్టతీర్థం ముస్తాబైంది. ఆలయ ట్రస్టీ, సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కలెక్టర్ బాలాజీ మిద్దెతోట పరిశీలన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తడి చెత్త, ఆవుపేడతో సేంద్రియ ఎరువులు తయారు చేస్తూ ప్రజలు తోటలను పెంచాలని కలెక్టర్ డి.కె. బాలాజీ పిలుపునిచ్చారు. మచిలీపట్నం గాంధీనగర్‌లో మిద్దెతోటను పెంచి సీఎం చంద్రబాబు నుంచి రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్న ముంతాజ్‌బేగం ఇంటిని సోమవారం ఆయన సందర్శించారు. మిద్దెపై పెంచుతున్న వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలను కలెక్టర్ సందర్శించారు. జామకాయలు, వాటర్ యాపిల్‌ను రుచి చూశారు. మొక్కలు పెంచే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కంపోస్టు, లిక్విడ్స్‌తో ఉల్లిపాయ తొక్కలు, ఎండిన ఆకులు, మట్టిలో కుళ్లబెట్టిన తడిచెత్తతో చేసే ఎరువులను ఏ విధంగా వేస్తున్నది ముంతాజ్‌బేగం వివరించారు.



మిద్దెతోటను సందర్శించి ముంతాజ్‌బేగంను అభినందిస్తున్న కలెక్టర్ బాలాజీ, కమిషనర్ బాపిరాజు

ముంతాజ్‌బేగంను కలెక్టర్ అభినందించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు కూడా కలెక్టర్ వెంట ఉన్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కోరారు. పర్యాటకంగా సాగర సంగమం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అటవీ శాఖ ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులు ఆయన వివరించారు. నియోజకవర్గంలో పుణ్యక్షేత్రాలు, ప్రాచీన బౌద్ధక్షేత్రం ఉన్నందున టెంపుల్ టూరిజం, ఏకో టూరిజంగా అభివృద్ధి చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిఆపరు. ఎదురుమొండి - గొల్లమంద ప్రధాన రహదారి శంకుస్థాపనకు, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు 11 సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు స్ఫూర్తినిచ్చేందుకు స్వయంగా నాగాయలంక, చల్లపల్లి ప్రాంతాలను సందర్శించాలని విజ్ఞప్తి చేసినట్లు బుద్ధప్రసాద్ తెలిపారు.



దుర్గానాగేశ్వరుని గ్రామోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామిని రాజాధిరాజ వాహనంపై వైభవంగా ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించగా, ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవం ప్రారంభించారు. ఆలయ పర్యవేక్షకులు వెంకట రమణ, చెన్నకేశవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పెదకళ్లేపల్లికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రమైన పెదకళ్లేపల్లికి అవనిగడ్డ, చల్లపల్లి, మచిలీపట్నం నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు అవనిగడ్డ ఆర్టీసీ డీఎం కె.హనుమంతరావు తెలిపారు. 25వ తేదీ ఉదయం నుంచి 26వ తేదీ సాయంత్రం వరకు మచిలీపట్నం, అవనిగడ్డ, చల్లపల్లి బస్టాండ్‌ల నుంచి ప్రతీ అరగంటకు సర్వీస్ నడుపుతున్నట్లు తెలిపారు.

అవతార్ మెహర్‌బాబా 131వ జయంతి నేడు

చల్లపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మనుషులంతా ఒక్కటే, మానవునిలోనే దేవుడున్నాడు, తోటివారిని ప్రేమించుటలోనే నిజమైన ఆనందమున్నది అంటూ మానవునికి ముక్తిమార్గాలను ప్రబోధించిన అవతార్ మెహర్ బాబా 131వ జయంతిని చల్లపల్లి ట్రావెలర్స్ బంగ్లా ఆవరణలోని మెహెర్‌బాబా ప్రేమ మందిరంలో మంగళవారం నిర్వహించనున్నారు. తెల్లవారుజామున హారతి, నగర సంకీర్తన, భజనలు, సాయంత్రం ఉయ్యాల, పేరంటం కార్యక్రమాలు జరుపుతారు. మధ్యాహ్నం ప్రేమవిందు నిర్వహిస్తారు. బాబాసెంటరు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగులు కరపత్రాలతో ఫొటోలు దిగొద్దు

ఘంటసాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళి నిబంధనల ప్రకారం ఉద్యోగులు ఎవరూ కరపత్రాలు పట్టుకొని ఫొటోలు దిగరాదని మండల నోడల్ అధికారి డి.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా శ్రీకాకుళం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ప్రచారం చేస్తున్నారని డెమోక్రటిక్ ప్రొటెక్షన్ ఫోర్స్ జిల్లా నేత డాక్టర్ రంగారావు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదులపై శ్రీకాకుళం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంఈవోతో విచారణ నిర్వహించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలిద్దాం - ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

అవనిగడ్డ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్‌ను నిర్మూలించి మానవళి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటూ నినాదాలు చేస్తూ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తూ అవనిగడ్డలో టీ స్టాల్‌కి గాజు గ్లాసులు పంపిణీ చేశారు. చైల్డ్ హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్లాస్టిక్ వాడకం ఎంతో ప్రమాదకరమని, ప్లాస్టిక్ వా డకం వల్ల వచ్చే వ్యాధులను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి అనిత మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకంతో క్యాన్సర్, చర్మవ్యాధులు, వినికిడి లోపం ఏర్పడుతుందన్నారు. చైల్డ్ హుడ్ సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలిథిన్ కవర్లు ఇదేవిధంగా వాడితే 2050 నాటికి మంచినీళ్లు కూడా దొరకవన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో కరపత్రాలు పంపిణీ చేశారు. దివి లీలాకృష్ణ, బచ్చు మధుసూదన రావు, స్టార్ రావు, అన్నపరెడ్డి కృష్ణ, మోపిదేవి శ్రీనివాసరావు, బండే శ్రీనివాసరావు, కమ్మిలి ప్రసాదు, చింతలపూడి శేఖర్, రేపల్లె అర్జున్‌చైల్డ్‌హుడ్ గ్రూపుసభ్యులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిర్మూలనపై చైల్డ్ హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ర్యాలీ



ఈ-బుక్ చూపుతున్న రంగారావు

ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని నిలిపివేయాలి

పర్యావరణవేత్త వడ్లమూడి రంగారావు

చల్లపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని పూర్తిగా నిలిపివేసినప్పుడే ప్రయోజనం కలుగుతుందని పర్యావరణవేత్త, వడ్లమూడి ఫౌండేషన్ నిర్వాహకులు వడ్లమూడి రంగారావు అన్నారు. సోమవారం చల్లపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దశాబ్దకాలంగా ఫౌండేషన్ తరఫున పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా అనేక జీవరాశులు నష్టపోతున్నాయనీ, అందుకే తాము ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించినట్లు తెలిపారు. జాగ్రత్తలు తీసుకోకుంటే ప్లాస్టిక్ కారణంగా భూమ్మీద జీవరాశులే అంతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. . కిండెల్ ఈ - బుక్ పేరుతో మూడు ఈ-బుక్‌లను రూపొందించినట్లు తెలిపారు. కంప్యూటర్‌లో సంబంధిత లింక్ ద్వారా బుక్‌లను చదువుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ వాడకంపై నేటి యువతరం పూర్తి అవగాహనతో ఉండాలన్నారు.



చెక్కు అందజేస్తున్న జాస్తి కుటుంబరావు

క్రీడాకారులకు పూర్వ విద్యార్థి ప్రోత్సాహం

ఘంటసాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : క్రీడకారుల ప్రోత్సాహనికి ఘంటసాల జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత అధ్యాపకులు జాస్తి కుటుంబరావు రూ.10 వేల చెక్కును ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంగవల్లికి సోమవారం అందజేశారు. జాస్తి కుటుంబరావు 1953లో ఇదే పాఠశాలలో పదవ తరగతి విద్యనభ్యసించారు. 90 సంవత్సరాల వయస్సులో కూడా క్రీడలకు ప్రోత్సాహంగా నగదు అందించటం పట్ల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. జాస్తి జగదీష్ చంద్రమోహన్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చేనేత కార్మిక సంఘం వినతి పత్రం

పెడన, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల సమస్యలపై ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా శాఖ నాయకులు సోమవారం చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాయిప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. చేనేత సహకార సంఘాలకు గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏపీ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు, జిల్లా అధ్యక్షుడు కోదాటి నారాయణ రావు, కార్యదర్శి బూసం బాలసుబ్రహ్మణ్యం, కుర్మా విఘ్నేశ్వరరావు, రావూరి వీరభద్రుడు పాల్గొన్నారు.

పెన్షనర్లకు సహాయం అందిస్తా : విక్కుర్తి

అవనిగడ్డ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో ఫ్లోరింగ్ ఏర్పాటు చేసేందుకు సహాయం అందిస్తానని పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ ప్రకటించారు. పెన్షనర్ల అసోసియేషన్ వార్షికోత్సంలో సోమవరం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన కాశీభట్ల నాగేశ్వరరావును సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, కోశాధికారి రాధాకృష్ణ, సుధాకర్, కార్యవర్గ సభ్యులు అడపా గురవయ్య, టి.కోటేశ్వరరావు, నాగభూషణం, రాంబాబు, కృపారావు పాల్గొన్నారు.



డాక్టర్ డీఆర్కేకు విరాళం అందిస్తున్న పురప్రముఖులు

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.52 వేల విరాళం

చల్లపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ఉప్పల బజారు నివాసితులు రూ.52 వేలు విరాళంగా అందజేశారు. స్వచ్ఛ చల్లపల్లి, మన కోసం మనం ట్రస్టుల ఆధ్వర్యంలో శ్మశాన వాటిక అభివృద్ధి జరుగుతుండగా, తమవంతు సామాజిక బాధ్యతగా ఉప్పల బజారు నివాసితులు విరాళాన్ని స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్‌కు అందజేశారు. విశ్రాంత ఏఈ వేముల శేషగిరిరావు, విశ్రాంత ఫోర్‌మెన్ ఉప్పల సాంబశివరావు, పోలీస్ కానిస్టేబుల్ ఉప్పల కోటేశ్వర రావు ఉన్నారు.



వీకేఆర్ ఫెస్ట్-2025 పోస్టర్ ఆవిష్కరణ

గుడివాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వీకేఆర్ ఫెస్ట్-2025ను మార్చి 4, 5 తేదీల్లో వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామని కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య తెలిపారు. సోమవారం కళాశాలలో న్యాయవాది కైకాల వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ఫెస్ట్‌లో ఫుడ్, యాక్టివిటీ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డ్యాన్స్, ఫ్యాషన్ షో, పాటలు, మిమిక్రీ పోటీలు, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, టెక్నికల్ క్విజ్, బ్రేక్ ది క్వయిరీ, క్రాక్ ది కోడ్, మ్యాసివ్ స్టేట్మెంట్ ఆఫ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, కిక్ ఆఫ్, ఫొటోగ్రఫీ, యూఐ ఫోర్జ్, అడిడా మేమే అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 94915 85714కు ఫోన్‌చేసి సంప్రదించాలని సూచించారు. అకడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, ఫెస్ట్ కన్వీనర్ కొల్లిపర దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పామర్రు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని, అన్ని ఏర్పాట్లు చేశామని పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రభ తెలిపారు. సోమవారం పామర్రు పోలీస్ స్టేషన్‌కు ఇంటర్ ప్రశ్న పత్రాలు చేరుకున్న సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రశ్నపత్రాలను స్టేషన్‌లో ప్రత్యేక బాక్సుల్లో భద్రపరిచారు. పామర్రు పరీక్షా కేంద్రంలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులతో పాటు ప్రైవేట్ కళాశాలల నుంచి 330 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల అధ్యాపకుడు జి.వెంకటేశ్వరరావు, డీవోగా మొవ్వ జూనియర్ కళాశాలకు చెందిన బి.గౌరిని ఇంటర్మీడియట్ బోర్డు నియమించిందని తెలిపారు. నిమ్మకూరు ఏపీ రెసిడెన్షియల్ కాలేజీలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి, వీవో వి.శాంభవి తెలిపారు.

కూచిపూడి పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు



మొవ్వలో ఇంటర్ విద్యార్థినికి హాల్‌టికెట్ ఇస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుధాకర్

కూచిపూడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలను సోమవారం కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షల నేపథ్యంలో మొవ్వ క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో నిర్వహించే పరీక్షలకు సెట్-3 ప్రశ్నపత్రాలను ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం ఆదేశాలతో హెచ్‌సీ మోహనరావు, జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ డి.సుధాకర్, డీఈవో గంగాధర్ పర్యవేక్షణలో పీఎస్‌లో భద్రపర్చారు. విద్యార్థులకు క్షేత్రయ్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డి.సుధాకర్ హాల్‌టికెట్లను పంపిణీ చేశారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంటిబాబు

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు

● ఆటో డ్రైవర్లకు రూరల్ ఎస్సై చంటిబాబు ఆదేశం

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవద్దని డ్రైవర్లకు రూరల్ ఎస్సై చంటిబాబు సూచించారు. మోటూరు అడ్డరోడ్డు, వలివర్తిపాడు బైపాస్ రోడ్లలో సోమవారం ఉదయం ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా పరిమితికి మించి ప్రయాణికులతో నడుపుతున్న ఆటోలను ఆపారు. ఆటోలు సీజ్ చేస్తామని డ్రైవర్లను హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనదారులు తమ వాహనాలు నడపాలని సూచించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడపొద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పమిడిముక్కల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, వాతావరణ కాలుష్య నివారణకు గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలని పమిడిముక్కల పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేశ్ సూచించారు. ఇళ్లలో వచ్చే చెత్త, ఇతర వ్యర్థపదార్థాలను తడి, పొడి, హానికరమైన చెత్తగా విభజించి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు సహకరించాని గ్రామస్థులు సహకరించాలంటూ పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తూ సోమవారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చచేశారు. ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం చినముత్తేవి సోమేశ్వరస్వామి



మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన చినముత్తేవి సోమేశ్వరస్వామి ఆలయం, అన్నపూర్ణా సమేత సోమేశ్వరస్వామి

ఇదీ స్థల పురాణం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న చినముత్తేవి సోమేశ్వరాలయానికి 700 ఏళ్ల చరిత్ర ఉంది. ఆలయ నిర్మాణానికి పూర్వం ఈ ప్రాంతం పాటిమట్టి దిబ్బలు, ముళ్ల కంపలతో ఉండేది. గ్రామస్థులు పాటి మట్టి తవ్వకాలు చేస్తుండగా, భూమిలోపల ఉన్న శివలింగానికి పలుగు తగిలి ఏకధాటిగా రక్తం కారింది. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రక్తం ఆగలేదు. స్వామి ఓ భక్తుడికి కలలోకి వచ్చి ఆ స్థానంలో శివాలయ నిర్మాణం చేయాలని సూచించారు. దీంతో గ్రామస్థులంతా కలిసి ఆ ప్రాంతంలో శివాలయ నిర్మాణం చేసినట్లు పూర్వీకులు చెబుతారు. సంతానం లేని వారు దీక్షలు, ఉపవాసాలు చేసి స్వామిని పూజిస్తే సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఆలయ ప్రాంగణంలోనే నాలుగు దేవాలయాలు ఉండటం మరో విశేషం. మహాశివరాత్రి ఉత్సవాలతోపాటు దసరా శరన్నవరాత్రి, కార్తీక మాసం, శ్రావణ మాసపూజలు, శివకల్యాణం, నిత్యం విశేష పూజలు, అభిషేకాలను ఈ ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

● మహాశివరాత్రి వేడుకలకు ఆలయం ముస్తాబు

(ఆంధ్రజ్యోతి- కూచిపూడి): స్వయంభువుగా వెలిసి భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలోని అన్నపూర్ణా సమేత సోమేశ్వరస్వామి ఆలయం ఈనెల 26వ తేదీన జరుగనున్న మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఆలయానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. మండలంలోని పెదపూడి, మొవ్వ, నిడుమోలు, అయ్యంకి, కూచిపూడి, కాజ, కోసూరు, గూడపాడులో శివాలయాలు శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబయ్యాయి.

మహిమాన్వితుడు పామర్రు సోమేశ్వరస్వామి

(ఆంధ్రజ్యోతి-పామర్రు): భక్తుల కోర్కెలను తీర్చే మహిమాన్వితుడిగా పూజలందుకుంటున్న పామర్రు గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయాన్ని మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. మూలవిరాట్‌ను దర్శించుకుని కోర్కెలు కోరుకుంటే అవి నెరవేరుతాయని భక్తుల నమ్మకం. మహా శివ రాత్రికి భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయాధికారి జె.వెంకటేశ్వరరావు తెలిపారు. 26న ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, రాత్రికి స్వామి శాంతికల్యాణోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



శివరాత్రి వేడుకల కోసం సుందరంగా తీర్చిదిద్దిన పామర్రు శివాలయం

రామబాణం పడి..రామగుండంగా మారి



ప్రాకర్లలో శివాలయం, పుణ్యస్నానాలు ఆచరించే రామగుండం

ప్రాకర్ల గ్రామంలో రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రికి అన్ని ఏర్పాట్లను చేసినట్టు నిర్వాహకుడు కరిపినేని రామలింగేశ్వరావు తెలిపారు. మహాశివరాత్రి రోజున 3వేలమందికి అన్నసమారాధన నిర్వహిస్తామని ఆయన తెలిపారు. శివరాత్రిరోజున పిండప్రదానాలు నిర్వహించే రామగుండం ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. పూర్వకాలంలో రాముడు వేసిన రామబాణం వచ్చి ఆ ప్రాంతంలో నీటికుంటలో పడగా అది చెరువుగా మారిందని అందుకే దీనిని రామగుండంగా పిలుస్తారని స్థల పురాణం చెబుతోంది. ఆనీటిలో పుణ్యస్నానాలు ఆచరిస్తే కాశీకి వెళ్లినంత పుణ్యం దక్కుతుందనే నమ్మకంతో పుణ్యస్నానాలు, పిండప్రదానాలు చేస్తారు. కాపవరంలో దేవదాయ శాఖ ఆధీనంలోని శ్రీకాపర్దేశ్వరస్వామి ఆలయాన్ని శివరాత్రికి ముస్తాబు చేశారు.

అన్న క్యాంటీన్‌లో 450 మందికి ఉచిత భోజనం

గుడివాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గాస్పెల్ టెంపుల్ మినిస్ట్రీస్ అధినేత బర్నబాస్ సజ్జా, జీవనరాణిల 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక అన్నక్యాంటీన్‌లో 450 మందికి ఉచితంగా భోజనం పెట్టారు. ఈనెల 14వ తేదీ నుంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మార్చి 1వ తేదీ వరకు కొనసాగిస్తామని బర్నబాస్ తెలిపారు. గుడ్‌మెన్‌పేట, పాముల కాలనీ, పంచవటి కాలనీల్లోని పేదలకు అల్పాహారం అందజేశారు.

అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

పెదపారుపూడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు సోమవారం ఎంఈవో-2 సురేష్ అధ్యక్షతన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్పీలు శివశంకర్, శ్రీదేవి, నాగజ్యోతి, అరుణకుమారి, శివనాగమణి శిక్షణ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే, బాల్యారంభ సంరక్షణ, విద్యా కార్యక్రమాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

● రైతులందరూ 28లోపు నమోదు చేయించుకోండి: ఏడీఏ స్వర్ణలత



కురుమద్దాలిలో అవగాహన సదస్సులో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ స్వర్ణలత

పామర్రు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రాయితీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు అగ్రిస్టేక్‌లో 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్య(ఐడీ)ను రైతులు ఈనెల 28వ తేదీలోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పామర్రు సబ్ డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు(ఏడీఏ) బి.స్వర్ణలత సూచించారు. సోమవారం కురుమద్దాలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై అవగాహన కల్పించారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ లింక్‌డ్ ఫోన్ నెంబర్‌తో వీఏఏలను సంప్రందిస్తే నమోదు పక్రియను పూర్తి చేస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి విశ్వనాథపల్లి శివనాగరాణి, వీఏఏ పావని పాల్గొన్నారు.

అవగాహనా కార్యక్రమాలు

పెదపారుపూడి: వెంట్రప్రగడ, వానపాముల, యలమర్రు, పెదపారుపూడి గ్రామాల్లో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రైతులకు అవగాహనా కార్యక్రమాలను మండల వ్యవసాయశాఖాధికారి ఎస్టీ ఆంజనేయరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు ఆధార్ కార్డు, దానికి అనుసంధానంగా ఉన్న మొబైల్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు.

విన్నకోటలో...

గుడ్లవల్లేరు: వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సునీల్ సూచించారు. విన్నకోట రైతు సేవాకేంద్రం వద్ద ప్రదర్శన చేశాక, అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రైతులందూ రైతు సేవాకేంద్రాలకు వెళ్లి వీఏఏలతో విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని సూచించారు.

గుడివాడ-కంకిపాడు రహదారి పనులు ప్రారంభం

పోస్టుకార్డు ఉద్యమ ఫలితమేనన్న భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు మురళీకృష్ణ



గుడివాడ-కంకిపాడు రహదారి పనులు చేస్తున్న యంత్రం

గుడివాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుడివాడ ప్రాంత ప్రజల పోస్టుకార్డు ఉద్యమం కారణంగానే గుడివాడ-కంకిపాడు రహదారి పనులు ప్రారంభమయ్యాయని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీని రహదారి పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారని ఆయన తెలిపారు. దీంతో ఆర్ అండ్ బీ అధికారుల్లో చలనం వచ్చిందన్నారు. రోడ్డు పనులను ప్రారంభించారని తెలిపారు. ఇది ప్రజలు చేసిన పోస్టుకార్డు ఉద్యమ ఫలితమని, ప్రజాస్వామ్యంలో సామాన్యుడి సంతకానికి ఎంతటి బలముందో దీనిద్వారా అవగతమైందని తెలిపారు. పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల ప్రభంజనం పునరావృతమవ్వాలి

● ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపిద్దాం
● విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



ఉండ్రపూడిలో ప్రచారం చేస్తున్న జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేశ్

గుడివాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో ఏ విధంగా మెజార్టీని సాధించామో ఎమ్మెల్సీ ఎన్నికలోనూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు భారీ మెజారిటీని తీసుకొచ్చి నాటి ప్రభంజనాన్ని పునరావృతం చేద్దామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. సోమవారం ప్రజావేదికలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. నాయకత్వ పటిమ కలిగిన నాయకుడు ఆలపాటి రాజా అని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. ఆలపాటి గెలుపులో భాగస్వాములవుతామని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తెలిపారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఎన్నికల పరిశీలకురాలు నూకాలమ్మ, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు భవిరి శంకరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక పోలింగ్ శాతం నమోదవ్వాలి

నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యేలా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని, కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. ప్రజావేదికలో కూటమి శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, పార్టీ మండలాధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ ఇన్‌చార్జులు, పోలింగ్ ఏజెంట్లు, కూటమి నాయకులు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

8, 10 వార్డుల్లో జనసేన ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం పట్టణంలోని 8,10 వార్డుల్లో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్ములూరులో టీడీపీ నేతల ప్రచారం

గుడివాడ రూరల్: బొమ్ములూరు యూపీ పాఠశాలలో మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ, టీడీపీ కార్యకర్తలతో కలిసి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు.

ఉండ్రపూడిలో..


పామర్రు: పట్టభద్రుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్య ఓటేసి గెలిపించాలని జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ కోరారు. కూటమి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కోరుతూ ఉండ్రపూడిలో టీడీపీ జిల్లా కార్యదర్శి మండపాక శంకర్‌బాబుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావు, సర్పంచ్ తోట పోలాక్షి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పామర్రులో ఆలపాటి విజయం కోరుతూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో టీడీపీ నేతలు ఈడే గంటయ్య, పరిస సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సోదరుల ప్రచారం


పెదపారుపూడి: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని వెంట్రప్రగడ గ్రామంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోదరులు వర్ల చాణిక్య, చైతన్య సోమవారం ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి(చంటి), కూచిపూడి సుబ్బయ్య, గొరిపర్తి రవి కుమార్ పాల్గొన్నారు.

డోకిపర్రులో..

గుడ్లవల్లేరు: ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలంటూ డోకిపర్రులో టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. జిల్లాపరిషత్ హైస్కూల్, ఎంపీపీస్ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను, సచివాలయాల ఉద్యోగులను కలిసి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీరమాచనేని శివప్రసాద్, వీరమాచనేని నాగజయరాం, వెంకటరెడ్డి, తెల్లాకుల నాగలక్ష్మి, జాని తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో ప్రచారం చేస్తున్న జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్



వెంట్రప్రగడలో ప్రచారం చేస్తున్న వర్ల చైతన్య, చాణక్య

కేఎస్ లక్ష్మణరావును గెలిపించండి



గుడివాడలో ప్రచారం చేస్తున్న ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు

గుడివాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం పట్టణంలో చోట్ల ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు ప్రచారం చేశారు. సమస్యలపై ప్రశ్నించడానికి శాసనమండలిలో లక్ష్మణరావు ఉండాలని, మొదటి ప్రాధాన్య ఓటు వేసి ఆయనను గెలిపించాలని పొంగులేటి కోరారు. ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల సందర్శనతో ప్రయోజనాలెన్నో

● ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్

గుడివాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలను సందర్శించడం ద్వారా ఎంబీఏ విద్యార్థులకు విషయ పరిజ్ఞానం, నైపుణ్యాలు పెరుగుతాయని ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ అన్నారు. సోమవారం గుంటూరు జిల్లా డోకిపర్రులోని జోసిల్ లిమిటెడ్‌ను ఎంబీఏ విద్యార్థులు సందర్శించారు. పరిశ్రమల నిర్వహణలో ప్రత్యక్ష జ్ఞానం సంపాదించడం వలన విద్యార్థులు వృత్తి నైపుణ్యాలు మరింత పెంచుకోవచ్చని ప్రిన్సిపాల్ అన్నారు. సబ్బుల తయారీపై జోసిల్ లిమిటెడ్ మేనేజర్ బెనర్జీ విద్యార్థులకు వివరించారు. విద్యుత్ తయారీ, దాని ద్వారా వచ్చిన వ్యర్థాలతో ఇటుకలు తయారు చేయడం, సబ్బుల తయారీ, ప్యాకింగ్, అమ్మకాలపై అవగాహన కల్పించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్కే ప్రసాద్, కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, అధ్యాపకులు సలీం, ఎం.భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోండి

● విద్యార్థులతో వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుభాష్‌చంద్రబోస్

పమిడిముక్కల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివి దానిని చేరాలని, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు గుత్తికొండ సుభాష్‌చంద్రబోస్ సూచించారు. కపిలేశ్వరపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై సోమవారం ఆయన అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం ఆవశ్యకత, ప్రయోజనాలపై డీవైఈవో ఐ.పద్మారాణి వివరించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ప్రకాశరావు, కోశాధికారి జగదీశ్, కార్యదర్శి తుమ్మల వెంకట గంగాధరరావు, సభ్యులు చిగురుపాటి శ్రీకృష్ణ బ్రహ్మానందరావు, చల్లా నరసింహమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.